AB_ 1433_1_5
SCP

పోటీబహుమానము : ఈసంచికలో పుట ౨౦౧ చూడుడు.

# విషయసూచిక


౧. ఆంధ్రుడా ... ౧౬౧
—మంగిపూడి వేంకటశర్మ

౨. పతిభక్తి ... ౧౬౩
—కొడవటిగంటి కుటుంబరావు

౩. అధికోద్యోగం ... ౧౬౮
—మొదలి వెంకటసుబ్రహ్మణ్యశర్మ

౪. నిరీక్షణము ... ౧౭౧
—ఊటుకూరు సత్యనారాయణరావు

౫. కల్లటిమనిషి ... ౧౭౨
—మునిమాణిక్యం నరసింహారావు

౬. చాందురాణి ... ౧౭౬
—దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డి

౭. దమయంతి : కిరాతుడు ... ౧౮౧
—శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

౮. సింహళద్వీపం కైఫియ్యతు ... ౧౮౨

౯. సోదరికి ... ౧౮౭
—వఝ్ఝల వేంకటేశ్వరకవి

౧౦. స్వాగతము ... ౧౮౮
—బొడ్డు బాపిరాజు

౧౧. ఆంధ్రునిడైరి ... ౧౯౦

౧౨. ఉంద్రాళ్ళతద్ది ... ౧౯౧
—కవికొండల వేంకటరావు

౧౩. గణేశస్తవము ... ౧౯౨
(సంకలితము)

౧౪. సంపాదకీయసమాలోచన ... ౧౯౪

౧౫. హస్తసాముద్రికము ... ౧౯౭
—"శ్రీ"

౧౬. చిన్ననాటిచెలిమి ... ౨౦౦
—నరహరిశెట్టి శేషగిరిరావు

౧౭. కాశీనగరాంధ్రుల కర్తవ్యములు ... ౨౦౫
—బులుసు వేంకటరమణయ్య

౧౮. విడ్డూరములు ... ౨౦౭

౧౯. ఇన్సూరెన్సు విషయములు ... ౨౧౯

౨౦. హిందూమహాయుగము: గ్రంథాలయములు ౨౧౩

౨౧. ఆరోగ్యవిజ్ఞానము ... ౨౧౬

౨౨. పరాసుదేశపుస్త్రీలు ... ౨౧౮

౨౩. 'ఆంధ్రభూమి'పుస్తకపీఠము ... ౨౨౧



## గుండా సుబ్బారాయుడు

హార్డువేరు మర్చంటు బజారువీధి. డోరు, నెం 11-49 **బెజవాడ.**


అన్నిరకముల ఇనుపసామానులు, సీమసామానులు, రంగులు, వార్నీషులు, అవిశెనూనెలు: మరమేకులరకాలు, కవిళ్లరకాలు, ఇండ్లకు పనికివచ్చుబందులు వగైరాలు, బీరువాలకు పనికివచ్చు తాళపురేకులు, తలుపులకు పీటలకు పనికివచ్చు యిత్తడిపువ్వులరకాలు, యింజనులకు పనికివచ్చు ఆకురాళ్లు, నట్లు, వాచర్లు, రివెట్లు, ఇనుపరేకులు, యెమిరిపేపర్లు, మరియు అన్నిరకాల ఫెట్ వర్కుసామానులు మావద్ద దొరకును. ధరలకు వ్రాసుకొనుడు. ఆర్డర్లు వి. పి. ద్వారాపంపబడును. మంచిసరుకు, ధరలుసరసము.

# ప్రకటనలు

[ఆంధ్రభూమి యందు ప్రకటించుటకు ఉంచబడిన రేట్లవివరము: ఒక్కతూరికి పూర్తిపుటకు: రు. ౧౨-౦-౦; అరపుట : రు. ౭-౦-౦; పావుపుటకు: రు. ౪-౦-౦. ఈప్రకటన చార్జీలు ముందుగా ఈయనక్కఱలేదు. వౌచరుకాపీతో పంపబడు బిల్లు అందుకొనిన అనంతరము పంపనగును. అర్ధసంవత్సరము అంతకుపైబడిన కాలములకు కంట్రాక్టు తీసికొనినయెడల నూటికిపంద్రెండున్నరవంతున కమీషను ఈయబడును. ప్రత్యేకస్థలముల రేట్లు వలయువారు 'ఆంధ్రభూమి' కార్యాలయమునకు వ్రాయునది.]


| నెం. | ప్రకటించినవారు. | | ప్రకటించినవస్తువు. | | పుట. |
|---|---|---|---|---|---|
| 1. | దిడక్కన్ అన్యూరెన్సుకంపెనీవారు | ... | డక్కన్ అన్యూరెన్సు | కవరుపుట | 2 |
| 2. | జేమ్సుఫెర్ ప్యూమరీకంపెనీవారు | ... | "లిండాల్సు" టూత్ పేస్టు | ... | 1 |
| 3. | ఆయుర్వేదాశ్రమము | ... | జీవామృతము | ... | 1 |
| 4. | ఆర్య రసాయనశాల | ... | సువర్ణసుందరరసము, అభ్రకభస్మము | ... | 2 |
| 5. | లాల్ జి గోధుఅండ్ కంపెని | ... | రోలు కృష్ణమార్కు, ఎల్ జిమార్కు ఇంగువ | ... | 3 |
| 6. | లక్ష్మీరతన్సు లిమిటెడ్ | ... | శానిటరీ ఇన్ స్టలేషన్సు | ... | 3 |
| 7. | శ్రీ యఱ్ఱమిల్లి మంగయ్యపంతులుగారు | ... | ఆంధ్ర ఇన్సూరెన్సు | ... | 4 |
| 8. | శ్రీగుండా సుబ్బారాయుడుగారు | ... | హార్డువేరు సామగ్రి | ... | 5 |
| 9. | రత్నాఅండుకో | ... | రత్నా ఫవుంటెన్ పెన్ | ... | 7 |
| 10. | వెల్ కమ్ స్టూడియో | ... | ఫొటోగ్రాఫి | ... | 8 |
| 11. | కె. నాథముని అండ్ సన్సు | ... | గోల్డుగోల్డు, మేలైన ఆర్టిస్టిక్ బంగారునగలు. | | 8 |
| 12. | పి. కోదండరాం పిళ్లే | ... | ఉత్తమతరగతి కత్రసామగ్రులు | ... | 9 |
| 13. | ది క్లిక్ అండుకో | ... | లైన్, అఫ్ టోన్, పోస్టరు బ్లాకులు | ... | 9 |
| 14. | వేంకటరామ్ అండ్ కో | ... | పుస్తకములు | ... | 10 |
| 15. | యస్. సి. అప్పాసామిచెట్టి అండుకో | ... | త్రైకలర్ ప్రోసెస్ బ్లాకులు | ... | 10 |
| 16. | రాపిడ్ జేంషెడ్ సన్సు అండ్ కో | ... | టి. టి. మిస్కి ఇంగువ | ... | 11 |
| 17. | శ్రీయం. కె. శ్రీనివాసన్ గారు | ... | దియునైటెడ్ ఇండియాలైఫ్ అన్యూరెన్సు | ... | 11 |
| 18. | నరసింహ అండు కో | ... | స్టాండర్డుసిరాలు | ... | 11 |
| 19. | శ్రీదత్తాత్రేయ అజీర్ణమాత్రల ఫార్మసీ | ... | దత్తాత్రేయఅజీర్ణమాత్రలు | ... | 12 |
| 20 | గంధర్వఫార్మసీ. | ... | గంధర్వకళ | ... | 12 |
| 21. | భారతభైషజ్యనిలయము | ... | శిశుపోషణి | ... | 12 |
| 22. | భవానీ ఫార్మసీ | ... | స్వర్ణమాలిని | ... | 12 |
| 23. | అమృతాంజనము డిపో | ... | అమృతాంజనము | కవరుపుట | 3 |
| 24. | డాక్టరు జమ్మి వేంకటరమణయ్యగారు | ... | లివర్ అండ్ స్ప్లీన్ స్పెసిఫిక్ | కవరుపుట | 4 |

"ఆంధ్ర భూమి"



పురిపండా అప్పలస్వామి.

# ఆంధ్రుఁడా!

ఆంధ్రుఁడా! నీవు పరభూములందునున్న
సాగరముదాటి దూరదేశములనున్న
ఖండఖండాంతరంబులకడలనున్న
పలసదేశంబులందు నివాసమున్న
తెలుగుబిడ్డవె, సుమ్మిది తెలిసికొనుము.
నీవు నీదేశమందు జన్మించకున్న
నీవు నీబాస పూర్తిగా నేర్వకున్న
నీవు పరమతపరధర్మనిరతినున్న
నీవు పరసంప్రదాయముల్ నెరపుచున్న
తెలుగుబిడ్డవె, నిజముగా తెలిసికొనుము.
నీవు పరవేషములు వేసి నిగుడుచున్న
నీవు పరభాషలెన్ని జీర్ణించుకొన్న
నీవు నీభాష స్మృతియందు నిలుపకున్న
నీవు నీమత మొంత మన్నింపకున్న
తెలుగుబిడ్డవె, నిను నీవు తెలిసికొనుము.
నీవు నీభూమి విడువంగ నేర్తుగాక
నీవు నీభాష మరువంగ నేర్తుగాక
నీవు నీనడవడి మానసనేర్తుగాక
నీవు నీజాతి నిరసింప నేర్తుగాక
నీవెటులు నాంధ్రుడవు గాకపోవు సుమ్ము.
నీవు పరదేశములయందు నెలవుగాంచి
దొడ్డవాడను కీర్తినొందుదువుగాక
చెడ్డచేష్టల కలవడి చెడెదుగాక
కూలిపని చేసుకొని బ్రతుకుదువుగాక
బిచ్చమెత్తుకు పొట్ట నింపెదవు గాక
భాగ్యవంతుడవై మిట్టిపడెదుగాక
భోగవంతుడవై పొంగిపోదుగాక
నిత్యసుఖశాలివగుచు రాణింతుగాక
ఘోరదారిద్ర్యమునకు జిక్కుదువుగాక
క్రూరరోగభయార్తి గ్రుక్కుదువుగాక
సంతతస్వేచ్ఛచే ప్రకాశింతుగాక
స్వేచ్ఛ లేక కృశించి నశింతుగాక
నీవు గడియించుప్రఖ్యాతి నీదికాదు
నీవు పొందెడునిందలు నీవికావు
నీవు పడసెడుమన్ననల్ నీవికావు
నీవుపడుపాట్లు నిజముగా నీవికావు
నీ వనుభవించు సకలంబు నిన్నుగన్న
యాంధ్రజననిదె సుమ్మిది యరయుమయ్య.
పుట్టనే లేదు నేనాంధ్రభూమియందు
మెట్టనే లేదు నేనాంధ్ర మేదినిపయి
చూడనే లేదు నే నాంధ్రక్షోణినెపుడు
వాడనే లేదు నే నాంధ్రభాష నెపుడు
పీల్వనే లేదు నే నాంధ్రవీథిగాలి
నిల్వనే లేదు నే తెల్గునేలమీద
త్రావనే లేదు నే నాంధ్రధరపయస్సు
పోననే లేదు నే నాంధ్రభూమియందు
శైలశృంగారకాంతారజలధితీర
సైకతస్థలసారకాసారపుణ్య
నదనదీసాగరద్వీపనవ్యభవ్య
సస్యసుశ్యామలామలచారుచంద్ర
చంద్రికాసారపూరప్రశాంతదేశ
సంతతవిహారసౌఖ్యంబు చాయనైన
తెనుగుగానంబు విని చొక్కనెనయలేదు
తెనుగుక్రీడల నేనాడు తనియలేదు
తెనుగుతోటలపండిన తెనుగురుచుల
గేరు ఫలపుష్పముల రుచిసౌరభములు
నారసన నాదునాస లెన్నడునుగాని
యనుభవించి యెరుంగ వహోయటంచు

తెనుగుశిల్పంబుసిరికిని తెనుగుచిత్ర
నైపుణికి తెన్గుకైతవిన్నాణమునకు
భావ మలరారి తన్మయత్వమున జొక్కు
భాగ్య మేనాడుగాని నే బడయలేదు
నేను కలనైన తెనుగుజెండాను జూచి
ముదము తళుకొత్త కోర్కులు మోసులెత్త
తనువు పులకింప చిత్తము తత్తరింప
బత్తి చిగురెత్తగా చేతులెత్తి మ్రొక్కి
నాదుమానంబు పాదు ప్రాణాలబరణి
యిదియె నాయిలువేల్పు నాయేడుగడయు
నిదియె యనిపొంగి మురియలే దెపుడుగాని
తెలుగుసీమకు నాకును చెలిమి యేడ
ప్రేమ యెటుపుట్టు నా కాంధ్రభూమిమీద
అని వితర్కింపబోకోయి యాంధ్రతనయ !
తరతరంబులనుండి నీ తనువునందు
సోనలై పారునది యాంధ్రశోణితంబు
శోణితంబన నేల నీ సుభగమైన
యాకృతివిశేష మాంధ్రతాభ్యంచితంబు
అంగవైఖరి యాంధ్రరేఖాంచితంబు
లపనమే ఆంధ్రలక్షణాలక్షితంబు
ఇదియదియనంగ నేల నీ యీశరీర
మక్షయంబైన యాంధ్రులభిక్ష కాదె
పవసుసగన్న మాతోడ నీవుగూడ
తెనుగువాడవె నీయాదిజననియైన
తెనుగుభూమికి ఋణపడితివి నిజంబు
తెనుగునేలను జననంబు గనకయున్న
తెనుగుతల్లిని కనులతో గనకయున్న
తెనుగుధాత్రి సిపుడు ప్రోదిగనకయున్న
తెనుగుతత్వంబు నీకేమి తెలియకున్న
తెనుగుముద్రతప్పదు నీకు తెలియుమయ్య.
జన్మదేశముమీద నీజాతిమీద
నీయుదాసీనతను మాని వేయుమయ్య
తీరుతీయంబులకు సాటిదీటులేక
దేశభాషలలో లెస్స తెలుగటంచు
సకలజాతులచే పొగడికలుగన్న
తెనుగునుడికారముల సొంపు తెలియుమయ్య
తెనుగునడవడి నలవర్చుకొనగదయ్య
అనశతనునైన తెనుగన్నయమృతపునుడి
చెవికిసోకిన యంతనే చిత్తమలరి
తనువు పులకించునంతటి తమక మొదవు
నిరుపమానాభిమానాన నెగడుమయ్య;
అమితమమకారమున పాకులాడవయ్య.
తెనుగుభూమి తెనుగుజాతి తెనుగుబాస
తెనుగువేసంబు ప్రేమమై గనగదయ్య
తెనుగుసతులను యతులను తెనుగుకవుల
తెనుగురాజుల మంత్రుల తెనుగుభటుల
తెనుగునాయకమణుల కీర్తింపుమయ్య.
శీలసంపదచే శౌర్యశిఖలచేత
ప్రతిభచే ప్రభచేత ప్రభావగరిమ
చేత చౌషష్ఠివిద్యలచేత నిత్య
భూతిచే నీతిచేత విఖ్యాతిచేత
తెలుగుదేశంబు దీపించు తీరులెల్ల
తెలిసివర్తించి పనుల బోధించుమయ్య
మించుతమి ఫలసిద్ధి సాధించుమయ్య
ఖండఖండాంతరములం దఖండలీల
తెనుగువిజయోత్సవంబులు తెరలుకొనగ
తెనుగుమంగళతూర్యముల్ దిక్కరీంద్ర
కర్ణములను ప్రతిధ్వనుల్ గలుగమ్రోగ
తెనుగుమయమయి జగమెల్ల తేజరిల్ల
తెనుగుజాతిపతాక దిగ్గిశల జెలగ
తెనుగుజ్యోతిని వెలిగించి తనరుమయ్య;
ఘనత నాంధ్రత్వమును నిల్పుకొనగదయ్య;
తెనుగుజనని మహాశీస్సులను రహించి
జననసార్థకముగ మని తనియుమయ్య.

[illegible]

# పతిభక్తి


కథకులు

కొడవటిగంటి కుటుంబరావుగారు

చిత్రకారులు

శ్రీపాద దుర్గారావుగారు


౧

"ఇందులో నాతప్పేముందో ఆలోచించి చెప్పండి. నిష్కారణంగా ఈ అపవాదుపడ్డం నాకెంతమాత్రం ఇష్టంలేదు. మొన్న మామరదలుమటుకు మా మరదలన్నదా లేదా?... మా అక్కయ్య నీకు చాతబడి చేస్తున్నదిట, ఏమిటని. మొగుడూ పెళ్ళాల మధ్య లక్షగ్రంథం నడుస్తుందిగాక! అదంతా లోకం సొత్తయిపోయి ఈవిధంగా నన్ను బాధించడమనేదున్నదే, చాలా శోచనీయమే కాకుండా లబ్బున ఏడవాలిసిన సంగతి. నే నంతకన్న నొక్కిచెప్పలేను."

నిజమే! నాకు ఆడవాళ్ళు భర్తలయందు భయభక్తులూ, వినయవిధేయతలూ కలిగి దాసానుదాసులై ఉంటే చూడాలని ఉంటుంది. అంతమాత్రంచేతనే నన్ను పసిపిల్ల బాలాదిపర్యంతం వెర్రాసుపత్రికి పోతున్నవాణ్ణి చూసినట్టు చూడక్కర్లేదు. నాకూ ఈకాలపుపద్ధతులు నచ్చకపోలేదు. క్రాపింగులు పెట్టుకోండి, మైలగుడ్డలతో భోజనంచెయ్యండి, శూద్రవాళ్ళతో కలిసి ఒకబంతినే భోజనా లఘోరించండి. నే నడగను. ఎట్లాగో కలికాలం ఈవిధంగా వర్ణించే ఉందిట. కాని ఆడవాళ్ళకు స్వేచ్ఛఇచ్చి కులకమనటానికి నా అంతరాత్మను నిలువునా చీల్చినా ఒప్పదు. వాళ్లను ఖైదీలకిందఉంచి ఒక కాలితో ఒత్తిపట్టకపోతే—అమ్మ! స్త్రీబుద్ధిః ప్రళయాంతకహ అన్నవాడు వెర్రివాడా?

నాకింతమాత్రం ఆలోచనే పెళ్ళప్పుడుంటే పెళ్ళిచేసుకోక నేపోదును. కాని నాపెళ్లి నాకు చాలా చిన్నతనంలోనే అయిపోయింది. ఏంచెయ్యను? ఆభగవంతుడు నాయందు ఇంతకూ దయఉంచలేదు. నాభార్యకు ఇతరస్త్రీలందరికీ ఉన్న దుర్గుణాలన్నీ ఉన్నై. ఒకటి నవ్వటం. పురాణాల్లో పతివ్రతలను తీసుకోండి. వాళ్లెక్కడైనా నవ్వినట్టు నిదర్శనం ఉందేమో చూడండి. ఎందుకుంటుంది? ఆడది నవ్వితే నాకంతా ఇంతా మంటకాదు. చక్కగా, గంభీరంగా ఉండలేరూ? అసలు నవ్వే నాలుగందాల చెరుపని ఊరికే అన్నారా ఏమిటి? రెండోదుర్గుణం అతిగా మాట్లాడటం. పతివ్రతకు—అనగా సర్వకాల సర్వావస్థలయందూ మొగుడిసంగతి విచారించేదానికి—అంత మాట్లాడటానికి అవకాశం ఎక్కడుంటుంది? ఒకళ్ళతో ఒకళ్ళు ఎక్కువగా మాట్లాడుకోటం ఒకటి. మగవాళ్ళతో మాటకుమాట సమాధానంచెప్పటం ఒకటి. ఇటువంటి దుర్గుణాలు సామాన్యంగా ఆడవాళ్ళందరికీ ఉన్నై. నాదురదృష్టంచేత అన్నీ నాభార్యకూ అబ్బినై. ఏచింతా ఎరగని నాజన్మ కిదో పెద్ద మనోవ్యాధి అయిపోయింది.

ఇవన్నీ బహిరంగంగా చెప్పవలిసినవి కావు కాని ఉన్నసందర్భమంతా పూసగుచ్చినట్టు చెప్పకపోతే నావల్ల నేరం ఉన్నదీ లేందీ మీకెట్లా తెలుస్తుంది?

నాపెళ్లాం అంద రాడవాళ్ళల్లే ఉండటమే కాకుండా వాళ్ళు వాళ్ళమొగుళ్ళను చూస్తున్నదానికన్న నన్ను చాలా-చులకనగా చూసేది. నన్నన్నీ అసందర్భమైన ప్రశ్నలు వేసేది. త్వరగా వంటకానీవే అంటే మిమ్మల్ని వెనకనించి అట్లా తరుముతుంటే మీరాఫీసులో ఎన్నాళ్లు పనిచెయ్యగలరు? ప్రతిరోజూ మీచేత అట్లా అనిపించుకోవాలంటే చూడండి ప్రాణంఎట్లా ఉంటుందో అంటుంది. కావాలని ఎన్నిసంవత్సరాలైనా వంటచెయ్యొచ్చుగాని వంటచెయ్యకతప్పదు, విధి, అనుకుంటూ ఒక్క రోజుకూడా చెయ్యలేనమ్మా అంటుంది.

"ఏమండోయి! ఇవాళ పొద్దున మీరిట్లాఆఫీసుకు పోగానే మీబావగారొచ్చారు." (మామేనత్తకొడు కన్నమాట!)

"ఊఁ !"

" 'వాడున్నాడా?' అన్నారు."

"నన్ను నువ్వు 'వాడు' అనవచ్చునా ?"—నేను.

నాపెళ్లాం ముక్కుమీద వేలుపెట్టుకుని, "రామ! రామ! నేను మిమ్మల్ని వాడన్నానుటండీ ?"

"వాడున్నాడా అన్నాడంటివే?"

"అవును. ఆయనమాటలే అవి."

"అట్లా అనగూడదు."

"వారున్నారా అన్నారనాలా?"

నాకీపాటి కల్లా చిరాకువచ్చి నోరుమూసుకోమంటాను. నేను మాటాడలేక తిడుతున్నానంటుంది. మాటకుమాట చెప్పటం అసహ్యమైకాని ఇంతమాత్రానికే మాట్లాడలేక పోతామా ? ఇదీ వరస.

పువ్వుపుట్టంగానే పరిమళిస్తుందిట. కాపరానికి వచ్చినరోజు లగాయతు దానిబుద్ధి ఎప్పుడు ఒక్కదిక్కుకే ఈడుస్తుంటే! తల్లో పిన్నులుకావాలి. పౌడర్లుకావాలి. మాసపత్రికలు కావాలి. ఒక్కటికూడా ఇచ్చానని కల్లోకూడా అనుకోకండి. నాఉద్దేశం తెలీకుండా మొగుడసైనా విచారించకుండా నీకు డబ్బు ఖర్చవుతుందని భయంఅనటం పతివ్రతలక్షణమేనా ?

దీన్ని ఏమిటిచెయ్యటం అని చాలా దిగులుకలిగింది నాకు. బాగా యోచించినమీదట నాకొక్కటే ఉపాయం కనపడ్డది. ప్రతిరోజూ దానికి పతివ్రతల కథలు చదివి వినిపించటం మొదలుపెట్టాను. నేనెప్పుడో మహాపతివ్రతలకథలని ఒకపుస్తకం కొన్నాను అది ఇప్పు డక్కరకొచ్చింది. తరవాత రామాయణం చదివాను.

ఒకరోజున నాభార్యకు పెద్దసందేహంవచ్చింది.

"ఏమండీ సీత మంచిపతివ్రతేనా !"

"అమ్మా! లోకంలో ముగ్గురు పతివ్రతల్లో ఒకత్తె."

"ఎవ రెవరండి ?"

"అహల్యా ద్రౌపతీ సీతా—వీళ్లు ముగ్గురూ."

"అహల్యంటే ఇంద్రుడితో—?"

"అట్లాఅంటే కళ్లురొంపూ పోతై."

"ద్రౌపతి పంచపాండవుల పెళ్లాంకదా ?"

"అబ్బో నీపాతివ్రత్యానికి వీళ్ల నెక్కిరించ వచ్చావే! సీత కేం వంక పెట్లావు?"

"అంతావంకే! అంతకన్న నేనే మంచిపతివ్రతను."

"ఎందువల్లో!"

"ఎందువల్లకాదో! ముందుసంగ తసలు సీత రాముణ్ణి నువ్వంటుందేం? ఏమిరాఅనికూడా అన్నది."

ఈవాదన కేంచెప్పను? అప్పటిమట్టుకు కొంపడి నోరుమూశాను. మర్నాడు మళ్లీ ఈసంగతే ఎత్తింది మాఇంటిది. ఆలోచించగా నాకే అంత బాగాలేదు సీత రాముణ్ణి గౌరవంగా పిలవకపోవటం. తరవాత నేను బాగా తెలిసిన పెద్దమనిషి నడిగా నీవిషయం. ఆయన చెప్పిందంతా అర్థంకాలేదు కాని ఉన్నసందర్భం ఇంచుమించుగా ఇది. సీతారాములూ వాళ్లూ వాడిన భాష తెలుగుకాదుట. అదిసంస్కృతం అన్నాడాయన. ఎందువల్లంటే అది దేవభాష కనక భగవంతుడి అవతారాల్లో అదే ఉపయోగించబడ్డదన్నాడు. తదుపరి సంస్కృతవ్యాకరణం మనతెలుగువ్యాకరణమల్లేకాక గొంతుపట్టేస్తుందిట. దానిప్రకారం ఎదురుగా ఒక్క మనిషి ఉన్నప్పుడు ఆమనిషి దేముడయ్యేది రాజయ్యేది ఏకవచనం ప్రయోగించాలిసిందేట. కనీసం ముగ్గురన్నా ఎదురుగాలేంది బహువచనంమాట తలపెట్టగూడదుట. అందుచేత సీత సంస్కృతంలో రాముణ్ణి ఏకవచనంలోనే సంబోధించింది తెలుగులో తర్జుమా చేసిన పెద్దమనుష్యులు ఆ ఏకవచనం ఏకవచనంగానే ఉంచారట ఇదంతా నాపెళ్లానికి చెప్పినమీదట ఎవరినో అడిగి కనుక్కున్నానన్నది. తనకు కావలసింది ఏకవచనమా, నేను కనుక్కోటమా ?

అయితేఏం? రాపాడగా రాపాడగా రాళ్లైన అరుగుతై. క్రమంగా నాపెళ్లానికి పాతివ్రత్యాన్ని చూస్తే గౌరవం ప్రారంభించింది. నన్ను పతివ్రతలక్షణాలు, పతివ్రతామహాత్మ్యం వీటినిగురించి అడగటం మొ


దలుపెట్టింది. చావుకుపడితే లంఖణాలకు రాకపోతుందా అని నాబుద్ధికి తోచినవన్నీ చెప్పాను.

౨

అదే మొదలనుకోండి నాకష్టాలకూ, అపఖ్యాతికీ.

పాతివ్రత్యాన్నిగురించి నా అభిప్రాయం నలుసంతైనా మారించుకోవస్తు—నే నంత తేలిగ్గా అభిప్రాయాలు మార్చుకునేవాణ్ణికాను—కాని ఈ పాతివ్రత్యాన్ని శాస్త్రోక్తంగా ఆచరణలో పెట్టాలంటే కొంత ఇబ్బంది కలక్కపోదు.

ఒకరోజుఉదయం నేను నిద్రలేచి పక్క మీదినించి లేవబోతూండగా నాపెళ్లాంవచ్చి నన్ను లేచినుంచోమని వంగి కాళ్ళంటుకుని కళ్లకద్దుకుంది. ఈచర్య నాకు వెంటనే అర్థంకాలేదు. చప్పున నాకు సిగ్గూ అసహ్యమూ కలిగి ఏమి టీవేళాకోళం అనబోతుండగా జ్ఞాపకంవచ్చింది! ఆరోజు కంతటితో పోయింది. ప్రతిరోజూ ఈ విధంగానే చేస్తుందాఏమిట్రా భగవంతుడా అని భయంవేసింది. కాని మరిచిపోకపోతుందా అనుకున్నాను. మరిచిపోయింది నేను. మర్నాడు మళ్లీ ఈప్రకారమే జరిగింది. ఆమర్నాడు. ఆమర్నాడు. ఆపని పోనీ చెయ్యకపోతే ఏమందామని నోటిదాకావచ్చింది. కాని ఎట్లాఅనను ? నేను చదివినకథలన్నీ ఇందుకేగా ? ఈనమస్కారాలుచేయించుకోటం కాకపోయినా నా ప్రాణానికొచ్చింది.



ఒకరోజు జ్ఞాపకంపెట్టుకుని అది లేవకముందే లేచి బయటికివెళ్లి ఎనిమిదింటికొచ్చాను. అట్లాతప్పుతుందా ? నేను కనబడగానే నన్ను నిలవబెట్టి నాపాదాలు కళ్ళకద్దుకుంది. మర్నాడుకూడా చీకటితోనే లేచిపోయి అది మడిగట్టుకున్న తరవాత వచ్చాను. కాని తప్పలేదు. మళ్లీ మడిగట్టుకుంటానన్నది. ఆఫీసుకు శలవరోజుగా చూసి ఒంటిగంట కింటికి వచ్చినా తప్పలేదు. ఇల్లు వదిలి దేశంమీదలేచి పోయేవాళ్ళ భార్యలందరూ చెడ్డవాళ్ళని చెప్పలేం!

ఇంకో మోసంకూడా జరిగింది. తెల్లవారుగట్టగదిలో నమస్కారాలుచేయించుకుంటే ఎవరికీ తెలీదేమోకాని కొంతపొద్దెక్కిన తరవాత ఆరు బయట చేయించుకున్నారో, లోకమంతా తెలిసిందే! మీభార్య ఇతరులుచూసి ఏమనుకున్నా లెక్కచెయ్యని పతివ్రత అయితే అడగక్కర్లేదు.

దీనితోనే నాకు దాన్నిచూస్తే మండలయిపోతే, ఇది చాలక పూర్వం చేసుకునే పోకలన్నీమానేసి జుట్టు గోళ్ళతోనే దువ్వి కొప్పుపెట్టుకుంది,

పెద్దకుంకంబొట్టు పెట్టింది, నీరకాయ చీరలు కాశా పోసి కట్టి భీకరాకారం దాల్చింది. రామరామ! మనిషిలో ఒక్క రవ్వయినా ఆకర్షణ లేకుండాపోయింది. ముక్కున వేసన్లే ఉండవలసిందేకాని ఉలకటానికీ పలకటానికీ వీలులేదు. అక్కడికీ మనసుపట్టలేక ఈ అవతారంలోనే అందంగా ఉండగూడదా అంటే, నవ్వి, "ఏంపెచ్చండీ మీకు? అందంగా ఉండాలంటే షోకులే చేసుకోవాలా ఏమిటి?" అంది అంతటితో నానోరుకట్టు.

కొద్దికాలమయిన తరవాత నాభార్య నేనుత్త నమస్కారాలతో తృప్తిపడటంలేదనేమో, పూజానమస్కారాలు ప్రారంభించింది. ఉదయం నేను లేవగానే పూలతో తయారు. అవి నాకాళ్ళమీద పూజచెయ్యటం, ఆపూలు కొప్పులో పెట్టుకోటం.

"పూలన్నీ నాకే పూజచేస్తే దేముడికో?" అన్నానొకనాడు.

"దేముడికి పూలెందుకు? నేను దేముడిపూజ మానేశాను."

నాగుండె బద్దలయింది. తరతరాలనించీ వస్తున్న దేముడిపూజ ఇప్పుడు మానేస్తే నెత్తి అదుస్తుంది!

"ఎందుకు మానేశావు?" అన్నాను గదమాయించి.

అది మహావినయంతో "క్షమించండి, నాకా దేముడితో పనిలేదు. నాకా రాతిలింగాల్లో ఇత్తడిబొమ్మల్లో నమ్మకంపోయింది. జ్యోతిల్లే మీరు సాక్షాత్తూ నాకళ్ళక్కనపడుతుంటే—"

"నివేదనైనా చేస్తున్నావా?"

"లేదు."

నాకు తక్షణం ఎక్కడికైనాపోయి ఎక్కెక్కి ఏడవాలనిపించింది.

దాన్నికొప్పడి ఏమీలాభంలేదు. ఇప్పుడీధోరణిమారి వెనకటి తోవలో పడితే నన్ను గడ్డిపరకకింద చూడదు. నేను సన్యసించవలసినవాణ్ణే. దేవతార్చనమానినప్పుడల్లా గుండెబద్దలవుతున్నది. ఎంతకాలం దేముడీఅకార్యం ఓరుస్తాడు? దానికేం? దాని పాతివ్రత్యం దాన్ని రక్షిస్తుంది. దెబ్బపడేది నానెత్తిన.

ఈదుస్థితిలో ఒకనాడు నాపెళ్లాం నాతో అమృతమంటిమాట ఒకటి అన్నది.

"ఏమండీ, ఇంట్లో పూజాపునస్కారాలులేకపోవటంనాకు బాగాలేదు."

"అద్భుతమైనమాట అన్నావు. నీబుద్ధి కింతమంచి

---

పై మాసపు సంచికలో

'పతిభక్తి' యను ఈకథను వ్రాసిన

శ్రీయుత కొడవటిగంటి కుటుంబరావుగారి

## బొమ్మల పెళ్ళిళ్ళు

అను కథ ప్రచురింపబడును. ఆకథ బోధించు సత్యమిది:

"తనపెళ్ళినిగురించి మాట్లాడటానికి సిగ్గుపడని పిల్ల ఉండదు. ఒకవేళ మాట్లాడిందా ఆసంబంధం తనకు ఇష్టంలేదన్నమాట. ఇష్టంఉంటే ఆసంబంధం అవుతుందని నమ్మకం ఏమీలేదన్నమాట.

స్త్రీ ఇంకొకరి రహస్యాలు భద్రంగా దాచలేకపోయినా తనరహస్యాలుసంబంధించినంతవరకూ ఇనపపెట్టే.

మగవాడు ఒక్కసారి మందరంనించి తారానికి పోగలడు.

మగవాడు తనయిష్టంవచ్చినపిల్లను పెళ్ళిచేసుకోటానికి నీతి, మతం, సంఘం - వీటినిగురించి తనకున్న అభిప్రాయాలన్నీ మార్చుకోగలడు"

---



ఆలోచన ఈమధ్య ఎన్నడూ వచ్చినట్టు నాకు గుర్తు లేదు! దేవతార్చనకు మామూలు ప్రకారం పూజానివేదనలు చెయ్యి."

అది నాకు వళ్ళుమండేటట్టు తలఅడ్డంగా తిప్పి "అది కాదు. ప్రతిరోజూ మీకే పూజచేస్తాను," అన్నది.

నావెంట్రుకలు ఒక్కసారి నిక్కపొడుచుకున్నై. భయంతో శరీరం యావత్తూ కంపరమెత్తింది. ఎట్లా వద్దనను?

నాచేత స్నానంచేయించింది. మా అత్తవారిచ్చిన బరంపురం పట్టుతాపితాలు తడిపిఎండేసి అవి నాచేత కట్టించింది. ఒకపీటమీద పసుపురాసి ముగ్గుపెట్టి దానిమీద కూర్చోమంది. పట్టుబట్టలు చెడిపోతాయంటే నేతపట్టుబట్టలు పోతేపోయినయ్యాంది కూర్చున్నాను. నెత్తినిండా పూలు అక్షింతలూ వేసింది నీళ్ళుచిలకరించింది. బట్టలన్నీ ధ్వంసమయినై, నేను సగంపైగా చచ్చిఉన్నాను.

ఈసమయంలో "దొడ్డమ్మా" అంటూ వచ్చాడు పడిపోయినట్టు మామరదలికొడుకు నాపాలిటి యమకింకరుడల్లే!

ఇంకా ఈవిధంగా జరుగుతునేఉంది. కాని నేను తగిన మనోబలంతెచ్చుకుని త్వరలో ఇది అంతమయ్యేటట్టు చేస్తాను. నన్ను కుక్కనుచూచినట్టు చూస్తే చూసింది, నాపెళ్ళాం మళ్లీ నాదగ్గిరికి వాలుజడేసుకుని చక్కని చీరకట్టుకుని మొహం సబ్బువాసనా, ఫేసుపౌడరు వాసనా కొట్టుతూ వస్తుందా అని అనుకున్నప్పుడల్లా గుండె నీరవుతున్నది.



# అదీ ఉద్యోగం

ఒకరోజున ఒక ఆఫీసులోకి వెళ్ళాను.

నేను వెళ్ళాననడంలో అత్యావసరత్వం యిమిడి ఉందన్నమాట. అంత అవసరమే లేకపోతే ఏ ఆఫీసుకు, ఏ ఆఫీసరుదగ్గరకు వెళ్ళనేవెళ్ళను. వెళ్ళడమంటే భయంకూడానూ. ఈ పాతికసంవత్సరాలలోనూ ఒక్కసారి ఒక గెజటెడ్ ఆఫీసరును చూద్దామని, నాఅంతట నేను వెళ్లి పగలు పన్నెండుగంటలలో ఏరెండుగంటలో ఉదయం కాలకృత్యాలకు భోజనానికి పోగా మిగిలిన పదిగంటలూ కాచుకొనిఉండి చూడడం తటస్థించకుండా వచ్చాను. మరొకసారి ఒక పెద్దమనిషిద్వారా ఒక డ్రిస్ట్రిక్టుబోర్డు ప్రెసిడెంటును చూశాను. ఇహ ఆఫీసరునే ఎరగను.

ఏ ఆఫీసుకూ నాఅంతట నేను ఒంటరిగా వెళ్లలేదన్నమాటే, ఆమధ్య తాలూకాఫీసులో పనిచేసిన నాలుగునెలలూ తప్ప. ఆఉద్యోగమయినా ఒకర్ని చూడవలసిన అవసరములేకుండా వచ్చింది గనుక చేశాను. లేకపోతే ఆఉద్యోగమూ దొరకదు. నేను చేయనూచేయను. అంతకు తరువాతగాని, అంతకు పూర్వంగాని, ఆఫీసుకు వెళ్లితే ఎవరితోనైనా స్నేహితులతో వెళ్లవలసిందే. లేకపోతే వాళ్లేమనుకుంటారో అని భయం.

ఇప్పుడు మాత్రం ఒంటరిగా వెళ్ళడం తప్పలేదు. ఆఫీసు గేటుముందరే ఒకకుక్క తయారుఅయింది. అది నన్నుచూసేచూడడంతోనే బొంయిమని లేచింది. అది నన్నేం కరుస్తుందని భయంవెయ్యలేదుగాని, అపశకునమేమో నని భయంవేసింది. సబ్ట్రెజరీ ఆఫీసరు త్వరగా రాడేమో, షరాబు భోజనంచేసి సిగరెట్టుకాల్చుకుంటూ వచ్చేసరికి ఏరెండుగంటలు దాటుతుందో. ఆరోజు చలానారసీదు యూనివర్శిటీకి పంపగల్గుదునో లేనో అని అనుమానం వేసింది. అయినా పిల్లికనబడితే అపశకునం పిల్లికి విరోధిఅయిన కుక్క కనపడితే మంచిశకునమే అని సరిపుచ్చుకొన్నాను. కాని ఈ కుక్క భొంయిమంటూ మీదికివచ్చింది ! కుక్క కనబడడం మంచిదేకావచ్చు కుక్క అరవడమో? ఈవిషయమయి ఆశే ఆలోచించడానికిమట్టుకు నాకు వీలు చిక్కలేదు. ఆసిరస్తాదారుగారు నాపైకం కట్టుకుంటే నేనువెళ్లి ఆరసీదు రిజిష్టరుకవరులో యూనివర్శిటీకి పంపాలె. ఎంత ఆలస్యమవుతుందో ఏమో ? రెండుగంటలుదాటితే పోస్టాఫీసులో రిజిష్టరు చేయరు. ఆయనగారితో మాట్లాడడం ఏలాగో! నేను పనిచేసిన తాలూకాఫీసులోఆయనలాగానే ఈయన గూడా అతి చాదస్తుడూ, ముక్కోపీ అయితే ఇహ నాపని చెప్పనక్కర్లేదు ఈ ఆలోచనలు నన్ను కలవరపెడుతూంటే మెల్లగా ఆఫీసువరాండా చేరాను.

షరాబుగారు కూర్చుండేచోటికి వెళ్లాను. అక్కడ షరాబులేడు. సబ్ట్రెజరీ ఆఫీసరూలేడు. సాధారణంగా ఆఫీసుకు గుమాస్తాలుగాని, ఆఫీసర్లుగాని ఒకగంట ఇటోఅటో - తఋచుగా అటే - వస్తూంటారని నేను పదకొండున్నరకు మాయింటిదగ్గర బయలుదేరి పన్నెండింటికి ఆఫీసుకు వెళ్లాను. ఆఫీసులోమటుకు ఎవ్వరూ లేరు, ఒకరిద్దరుతప్ప. నేనేమైనా పొరపాటు పడ్డానేమోనని గడియారమువైపు చూశాను. అదీ పొరపాటుపడలేదు చివరకు తాలూకాఫీసు గడియారంకూడా పొరపాటుపడలే. అయినా తాలూకాఫీసు ఉద్యోగస్థులు ప్రపంచకానికి కొన్నిగంటలు వెనకాల ఉంటారని అప్పుడు నాకు జ్ఞాపకంవచ్చింది. ఒక్కొక్క తాహసీలుదారుకు సాయంత్రం ఆరుగంటలప్పుడు పదకొండుగంటలయి రాత్రి పదకొండు పన్నెండింటికిగాని అయిదుగంటలుగాదు. ముసలివాడై ఇంటిదగ్గర ఏమీ యావలేకపోతే పొద్దున్నే పదకొండుగంటలవుతుంది; అర్ధరాత్రి అయినా అయిదుగంటలుగాదు. చిన్నవాడై ప్రాపకంవల్ల తాసీల్దారయితే ఆఫీసుటయిము అయిదుగంటలూ అట్టే అయి

పోతవి. వాళ్ళవేళకూ నవగ్రహసంచారానికీ సంబంధమేలేదు. వాళ్ళనుబట్టే మిగిలినవారూనూ.

సిరస్తాదారుగారు ఎంతసేపటికి వస్తారో కనుక్కుందామని అక్కడ ఒక జవానుంటే- అతను జవానే అనుకున్నా. మొహంలో దవాలు అదీవుంది- "సిరస్తదారుగారు ఎప్పుడు వస్తారయ్యా?" అన్నాను. అతనికి నామాటలు వినపడనేలేదు. వినపడలేదేమో పరధ్యాన్నంగా ఉండడంవల్ల పెద్దగా చెప్పుదామనుకున్నాను. అయినా "నాకు చెముడా" అని అతను అంటాడేమోనని మెల్లిగానే "సిరస్తాదారుగారు ఎప్పుడు వస్తారు" అన్నా. అతను నావైపుతిరిగి 'ఎవరికి తెలుసు' అని నిర్మొహమాటంగా జవాబుచెప్పాడు. కాలుగాలినపిల్లిలా అక్కణ్ణుంచి వెళ్ళాను.

మేజస్ట్రేటుగారు అవతల కోర్టులో కేసులు విచారిస్తున్నారు. అప్పటికే జనం బయట వరాండాలో కూర్చుని గుసగుసలాడుకుంటున్నారు. ప్రతివాళ్ళ వ్యవహారాలు ఆ కూర్చున్న కాసేపులోనే కావాలె. ఏమిటో ఒకటే మాట్లాడడము. చాలాసేపు ఊరుకున్నాడు ఆమేజస్ట్రేటుగారు. చివరకు కోపంవచ్చింది కాబోలు రామామరి. ఊరికే, కారణంలేకుండా జవాన్లకు కోపంవస్తూంటే, ఆఫీసరును, అందులో క్రిమినల్ పవరుచేతిలో ఉన్నాయనకు కారణం ఉన్నప్పుడు కోపంరావడం ఆశ్చర్యమేముంది- జవానును పిలిచి "మాట్లాడేవాళ్లను అవతలికి వెళ్ళమను. ఏమిటా గోల" అన్నాడు. అసలు జవాన్లు చెలాయించే అధారిటీకి ఒకళ్ళు చెప్పనవసరమేలేదు. అందులోనూ పై అధికారుల అజ్ఞలేశంలేటే వాళ్లు తెలివితేటలన్నీ ఉపయోగించారన్నమాటే.

జవాను గబగబ బయటకువచ్చి "ఏమిటయ్యా! ఏమిటాగోల!! పెద్దవాళ్లుగూడానూ. మాట్లాడేవాళ్లు క్రిందికిదిగి మాట్లాడండి. లోపల కోప్పడుతున్నారు మమ్మల్ని." అని కేకలువేశాడు. అప్పుడే వచ్చాడు ఒకాయన రొజుకుంటూ. వచ్చి ఇంకోరితో ఏమిటో రహస్యంగా మాట్లాడుతున్నాడు. జవాను కాలగ్ని రుద్రుడై "ఏమయ్యా! ఇప్పుడేగా నోరుదించుకొని చెప్పింది. జ్ఞానంలేదు. లే అక్కడ. అవతలికి పో!" అన్నాడు. ఆయన నిర్ఘాంతపోయి ఆజనంవైపూ, ఆజవానువైపూ బిత్తరిచూపులు చూస్తూ మొహం చిన్నబుచ్చుకున్నాడు.

"పిడిదుంపతెగా! ఎంతసమాటలన్నాడు. ఈ కాలపు స్కూళ్లలో విద్యార్థులమీద ఉపాధ్యాయులకు ఈ జవానుకున్నంత అధికారమున్నా స్కూళ్లు బాగుపడిపోను" అనుకున్నాను.

ఇంతలో సిరస్తాదారుగారు వచ్చారు. ఆయనరాగానే వెళ్ళినాలాభంలేదని కొంచెంసేపు అక్కడేవుండి తరువాత వెళ్లాను. నేవెళ్లేసరికి నలుగు రయిదుగురు తాలూకాగుమాస్తాలు కాగితాలు చేత్తోబుచ్చుకుని ఆయనకు చూపించడానికి నుంచున్నారు. వీళ్లందరూ మాట్లాడడం కావాలె. అప్పుడు ఆయన చలానాలు తీసుకోవాలె. అర్జంటు అప్లికేషన్ ఫారము రిజిస్టరు చేయకపోతే చాలాయిబ్బంది. ఆపనిఅయి ఆయన పిలిచేసరికి ఆలస్యంఅవుతుంది ఫారం యిచ్చివద్దామని లోపలికి వెళ్లానుమెల్లగా.

సిరస్తాదారుగారు గుమస్తామీద ఏమిటో కేకలు వేస్తున్నారు. అప్పుడు చలానాయిచ్చే వీలేమీ కనపడలేదు. ఆయన కేకలు ఆపింతర్వాత యిద్దామని అట్లానుంచొని ఉన్నా. ఇంతలో ఏమూలనో పనిచేసుకుంటూన్న జవాను- ఇందాక నాకేంతెలుసు అన్నాతనే "ఏమయ్యా! ఎందుకువచ్చావు?" అన్నాడు. నేను నాచేతిలో ఫారం చూపించాను.

"ఎక్కడికి తీసుకువెళ్లుతున్నావు. ఇటుతే బుడబుడ లోపలికిరావడమే ప్రతివాళ్లూ. బయటనుంచి ఇవ్వలేవూ!" అన్నాడు.

"నీవు గేటుదగ్గరలేందే" అన్నాను మెల్లిగానే.

"నువ్వువచ్చావని తెలియలే. వచ్చిందాకా ఆగు" అన్నాడు. అతనితో నాకెందుకు అని ఫారం అతనికిచ్చి యివతలికి వచ్చాను.

ఎంతసేపు కూర్చున్నా అంతుపొంతు కనబడింది కాదు. ఎండుకావస్తున్నది. నన్ను హైరంకట్టడానికి కేక-

వేయలేదు. నాఅంతట నేను లోపలికివెళ్లితే ప్రతివె... మాట్లాడేవాడే. లోపలికి వెళ్లకపోతే ఆరోజు రిజష్టరు చేసేవేళయిపోతున్నది. నాకు ఏమీ తోచలే.

కూర్చొని కూర్చొని కొంతసేపటికి మనసుపట్టలేక లోపలికివెళ్ళాను. శిరస్తాదారు ఆగుమాస్తాలతోనే మాట్లాడుతున్నాడు- మాటలంటే కేకలలాంటివి. జవాను నావైపు చూశాడు. నేను ఎంతవరకయిందన్నాను. అవుతుందిలే. తొందరపడితేఅవుతుందీ. మేంపిలవమూ అయితే'' అన్నాడు. నాకు బోధపడలేదు వాడిదర్జా. తిరిగి వరాండాలోకి వెళ్ళాను.

కొంతసేపటికి శిరస్తాదారు నాఫారం చేతులో పుచ్చుకుని "ఎవరయ్యా ఈయన ఇటురమ్మను" అన్నాడు ఆకప్పగొంతుతో. ఏమవుతుందో అని నేను జాగ్రత్తగా వింటున్నాను. వెంటనే దగ్గరకువెళ్ళాను. "ఏమయ్యా పదిహేను లేకఇరవయ్యి అనికాంటే ఏదోఒకటి కొట్టివేయకపోతే ఏలాతెలుస్తుందయ్యా మాకు? ఏంచదువులయ్యా! ఇవేంచదువులో - బియ్యే లనీ, ఎమ్మేలనీ వస్తారు ఏమీతెలియదు. మాకాలంలో ఇంత అన్యాయంలేదు'' అంటూ ఒకచిన్నఉపన్యాసం ఇచ్చాడు.

అయన అభిప్రాయం ఆయనతెలివితేటలకు, గొప్పతనానికీ ఆయనకు ఆశిరస్తాదారు ఉద్యోగంఇచ్చారని- బియ్యేపరీక్ష అయికూడా రిటైర్ కావచ్చే ఈడుకు సిరస్తాదారులో ఉన్నా.

నేను కొట్టివేయకపోవడము పొరపాటు, లేకపోతే అసంగతి తెలియకనా? అయినా ఆయనదగ్గర మన పని త్వరగా కావలసిఉండడంచేత, పనిఅయితే మాపర స్పరాధికార్యాలతోనూ, తెలివితేటలతోనూ అవసరం లేకపోవడంచేతా నేను ఆయనఅభిప్రాయంఆమోదించే, చూపుతో ఆయన అధికార్యాన్ని ఒప్పుకున్నట్టు నటిస్తూ సందర్భంలేకపోయినా రిజష్టరుటయిము అయిందని ఆయనకుతెలియాలెనని "రిజష్టరు చేసేటయిము అయిందండీ, పొరపాటు'' అని అది తీసుకుని ఒకటి కొట్టివేసి యిచ్చాను.

అక్కడే షరాబుకు పైకంఇవ్వడం. అందుకని ఆయన దగ్గిర్నుంచి షరాబువైపుకూ రెండుఅడుగులు వేశాను. ఆజవాను "అటురా, ఇటునుంచేనా?'' అన్నాడు. "చిత్తం'' అని పెద్దగాఅన్నాను. మొదట తెల్లబోయినాడు. తరువాత వేళాకోళానికి అన్నానని తెలుసుకున్నాడేమో తీక్షణంగా చూశాడు. కడుపులో అక్కసున్న బయటకు కనబరిచినతర్వాత వాడెలా చూస్తే ఎవరికాకావాలి?

తీరా పనిచేసుకు నేసరికి రెండున్నరఅయింది. తొందరగా పోష్టాఫీసు కెళ్లుదామని నడుస్తుంటే గేటుదగ్గర కుక్క మళ్లీ భొంయిమన్నది. దీనికిగూడా తాలూకాఫీసులో ఉద్యోగంకాబోలు ననుకున్నాను. లేకపోతే వచ్చేవాళ్ళమీద వెళ్లేవాళ్ళమీద అధికారం చెయ్యడానికి దానికంత దర్జా ఎక్కడిదా అనుకుంటూ నాపనిమీద వెళ్ళాను.

మొదలి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి






# నిరీక్షణము

ప్రేమరసమంత హృదయపాత్రికను మరగి
పోయెడి వియోగదారుణమ్మునకు క్రాగి
నీకొరకు కోసితెచ్చిన వీకలువలు,
పారుజాతసుమమ్ములు వాడుదేరె,
చందనము తేరి, చిటిలి వెచ్చనజనించె;
ఇది నదీతీర మేకాంత మిది ప్రశీత
లమధురరమణీయమసృణవిమలచంద్రి

కాధవళిత మీరేయి, నా కనులురెండు
విచ్చుకొనిపోయెడు దిశాంతవీథులంట
నీ నిరీక్షణమున, కాళ్లు పూనలేక
వడకెడు త్వదావలోకసంభ్రమముగోరి.
నీప్రసన్నజ్యోతిస్సులు నిండుకొన్న
మధురదర్శనమునకై జన్మాలనెన్నొ
తాల్చితిని నాథ !......................

శ్రీ కొ. రా. సత్యనారాయణ శాస్త్రి

# నల్లటి మనిషి

౧

తెనాలికి తొందరపనిమీద వెళ్ళవలసి రైలు బైలుదేరబో కొంచెము ముందుగనే స్టేషనుకు చేరాను. రైలు ఎక్కేముందు ఒక చివరనుండి ఇంకో చివరకు ప్లాటుఫారంమీద తమాషాగా పచారుచేయటం, ఏదైనా అందమైన ముఖం కనపడుతుందేమోనని చూడటం నాకూ అలవాటే చాలామందికి మల్లే.

ఒక పెట్టెలోమాత్రం ఒంటరిగా కూర్చున్న యువతి కనుపించింది. ఆమెముఖం అంత అందమైనది కాదు కాని ముఖకవళికలలో ఏదో కొంతఆకర్షణమాత్రం ఉన్నది. ఆమె దేహచ్ఛాయ పసిమీగాదు, నలుపూగాదు. అదోరకం తమాషా చామనచాయ. కేశములుమాత్రం దీర్ఘంగాను దట్టంగాను ఉన్నాయి అనుకొంటూ, ఎందుకంటే, ఆమె వేసుకొన్న బర్మాముడి గుబురుగా గోముగా పెరిగిన గులాబిపొదలాగ ఉన్నది.

ఆమె నన్ను ఆకర్షించింది. రెండుసార్లు అటునుంచి ఇటూ, ఇటునుంచి అటూ తిరిగాను. ఆమె నావంకకు చూచినప్పుడల్లా నేను తలవంచుకొని నన్ను చూడనట్లు తోచినప్పుడల్లా ఆమెవంకచూడటం మొదలుపెట్టాను. ఇట్ల ఇంకా నాలుగుసారులు తిరిగేసరికి ఆమె ఒంటరిగా ప్రయాణంచేస్తున్నదనీ ఆమెవెంట పెద్దవాళ్లెవ్వరూ లేరని నా కొక ఊహ కలిగింది. పరాయిస్త్రీ మొక్క అందాన్నిచూడటానికి నాకు అదే మొదటిసారి అవకాశంకలగటం.

ఎందుచేతనంటే మాకాంతంలేకుండా ఒంటరిగా నేనెప్పుడూ ప్రయాణంచేయలేదు. ఒంటరిగా ఉన్నా, ఆవిడలేని రోజుల్లో పరకాంత, పనిచేసేమనిషైనా సరే చివరకు నాకళ్ళకు కనపడకుండా ఉండే ఏర్పాటులుచేసి వెళ్ళుతుంది కాంతం. తాను పుట్టినింటికి వెళ్ళే ముందు పనిచేసేదాన్ని తీసివేసి రావద్దని కచ్చితంగా చెప్పి, పోట్లాడో పంపేస్తుంది. ఆవిడ లేనప్పుడు ఆడవాళ్ళు ఎవరూ మా ఇంటికి రారుగదా! కాలం అలా గడుస్తూఉండటంమూలాన పరకాంతల ముఖమైనా చూచే అవకాశం నాకెన్నడూ కలగక పోయినందున, ఆరోజున దొరికిన అవకాశాన్ని ఆహ్లాదంగా అనుభవిద్దామనుకొని అట్లా ప్రవర్తించాను.

ఇంతలో రైలుగంట కొట్టారు. పచ్చజండా ఊపారు. నేనూ నాపెట్టెను ఆమనిషి ఉన్న పెట్టెలోనికి పెట్టి ఎక్కాను. పెట్టెను నా ప్రక్కనే పెట్టుకొని ఆవిడకు ఎదురుగాఉన్న బల్లపైన కిటికీదగ్గరగా కూర్చోటం తటస్థించింది. ఇదంతా నేను చెయ్యాలని చెయ్యలేదు ఆసమయానికి అట్లా జరిగింది.

బండి కదిలింది నేనిప్పుడు ఆస్త్రీకి ఎదురుగా ఉన్నాను. ఆబండిలో ఇంకా ఇద్దరో ముగ్గురో మనుష్యులు ఉన్నారు. అవతలబెంచీమీద ఖాళీగాఉంది కాని, నేనెందుకు లేవటం, ఆవిడకు కష్టంగాఉంటే ఆవిడే లేచిపోతుంది అని అనుకొని అక్కడేకూర్చుని కొనుక్కున్న హిందూపత్రిక చదువుకుందామని మడత విప్పాను. పేపరు ముఖానికి అడ్డంగా పెట్టుకొని చదవటం ప్రారంభించాను. వాంటెడ్ కాలమ్స్, ప్రకటనలు చదివేసరికి ఆవలింతవచ్చింది. ఆ సందర్భంలో పేపరు ముఖంమీదినుండి తొలగించుకొంటుంటే ఆవిడ ముఖానికి తగిలింది. ఆవిడ క్రిందకువంగి పేపరులో చివరిపేజీలోనున్న విషయమేదో చదువుతున్నదని నాకేం తెలుసూ. అసలు ఇంగ్లీషువచ్చిన మనిషి అనే నేననుకోలేదు. ఆమె ముఖానికి పేపరుకొసలు తగలటం, వెంటనే ఆమెకురులు సవరించుకొంటూ, పమిట సద్దుకోటం చూచేసరికి నాకు నవ్వు వచ్చింది. అందుకని నవ్వుతూ ఎక్స్‌క్యూజ్‌మి అన్నాను. ఆమె మాట్లాడలేదు. ఆవిడకూ నవ్వువచ్చిందికాని నేను ఏమనుకొంటానో అని కాబోలు నవ్వు ఆపుకొన్నది. కాని ఆ ఆపుకొన్న నవ్వు ముఖమంతా వ్యాపించి ఆమె చిరుపెదవులలోనుంచి కండ్లకొసలలోనుంచి తొంగిచూడటం ప్రారంభించింది.

మళ్ళీ నేను పేపరుచదవాలని ప్రయత్నించాను. కాని అట్లా తొంగిచూచినవ్వు నన్ను చక్కిలిగింత పెట్టటం మొదలుపెట్టింది. వళ్లంతా ఏదో తేలిపోవటమున్నూ చదువుతున్నది అర్థంకాకపోవటం! అదీ నాఅవస్థ. ఆగిలిగింత ఎంతోసేపు ఆపుకొన్నాను. కాని ఆవిడతో మాట్లాడాలనిపించింది. పరస్త్రీతో మాట్లాడటం తప్పు అనీ, మాట్లాడినంత మాత్రాన ఏతప్పూలేదనీ రెండు ఆలోచనలో ఒకదాన్నిఒకటి తరుముకుంటూ వచ్చినయి. అదీకాక ఆకళ్లు, నొసలూ, ఆకెంపు పెదవులూ నన్ను అల్లా పలకరిస్తూఉంటే నేను మాట్లాడక ఊరుకోనా?

పేపరు ఇంతవరకూ మాఇద్దరిమధ్య తెరగాఉంది. దాన్నిమడిచి చేత్తోపట్టుకొని ఆవిడవంక ఒకమారు చూచి చప్పున మళ్ళీ కిటికీలోనుంచి ఆకాశంకేసి చూశాను. నాకెట్లాతెలిసిందో అట్లా చూపులను దొంగిలించాలని! నల్లనిమేఘాలు ఉన్నాయి ఒకవైపున. ఎదురుగా దిక్సతి తన కెంపు పెదవులతో అతనివైపు చూస్తున్నది. మేఘుడు ఊరుకొన్నాడా. ఆరక్తిమను గ్రహిస్తూనేఉన్నాడు. ఇంతలో ఆమె ఏంచేస్తున్నదో చూద్దామని బుద్ధిపుట్టి ఆమెవంక తిరిగిచూచాను. ఆమె ఆకాశాన్నిచూస్తున్నది.

నేను ఆమెను చూస్తున్నానని గ్రహించి ఆమె నావంక తిరిగింది. నేను నాచేతులోనున్న పేపరును ఆమెకు అందించాను. ఆమె మాట్లాడకుండా పుచ్చుకొని అటూఇటూ తిరగేసి ఏదో చదివినట్లేచదివి అయిదునిమిషాలలో మళ్ళా నాబల్లమీద పెట్టేసింది. పెదవి విప్పి ఒక్కపలుకైనా పలకలేదు. కాని ఆకళ్ళు, నొసలు నవ్వుతునే యున్నవి.

ఇంతలో గుడివాడస్టేషను సమీపించాము. బందరునుండి బయలుదేరినబండి ఇంత త్వరలో గుడివాడ వస్తుందనుకోలేదు. ఇంకేముంది; ఇంక కాసేపట్లో బెజవాడ వస్తుంది. అటుతరువాత ఎవరిదారి వారిదేకదా అనిపించింది.

చల్లనిగాలి వీస్తున్నది. వెన్నెలరాత్రికూడాను. గాలి నాచెవులో రహస్యంగా "ఊరికే చూస్తూ కూచుంటావేం. మాట్లాడరాదా" అని చెప్పింది. ధైర్యంతో పెద్దమనిషి తరహాగానే అన్నాను. "అమ్మా మీ రెంతవరకు ప్రయాణంచేస్తారు" అని. ఆమె నవ్వుతూ "మీరో" అన్నది. నేను తెనాలి వెడుతున్నానన్నాను. "నేనూ అటువైపే వస్తా" నన్నది. ఆమాటలు వినేసరికి నాకు ఏదో దేవగానం విన్నట్లు ఉన్నదిగాని ఎదుటనున్నస్త్రీ మాట్లాడినట్లుగాలేదు. బెజవాడలో గూడ ఆమెఎక్కిన పెట్టెలోనే నేనూ ఎక్కాలని అనుకొన్నాను. అదేమిటో ఆమె సామీప్యమే నాకంత ఆనందాన్ని ఇచ్చింది. అద్వయతులు దీన్నే కాబోలు సామీప్యం అంటారు!

## ౨

గుడివాడలో బండి ఆగినతరువాత ఆవిడ నన్ను ఉద్దేశించి "ఇక్కడ నీళ్ళకుళాయి ఎటువైపు ఉందండీ" అన్నది. ఇన్నిమాటలు ఒకేసారి వినేసరికి వెయ్యివీణలను ఒక్కసారి మీటినట్లుంది. దూరాన ఎక్కడో పాడుతున్న మధురగానాన్ని హాయిగా వింటున్నట్లుంది. నేను, "ఇల్లా ఇవ్వండి నీరుతెచ్చిపెడతాను" అన్నాను. ఆమె చిరునవ్వుతో "మీకు శ్రమ" అన్నది. "ఫరవాలేదు ఇల్లా ఇవ్వండి" అని ఆ మరచెంబు ఆమెచేత్తోనుండి తీసుకొని నీళ్ళుండే తావునకు ఒక్కపరుగున వెళ్లాను. కుళాయిలోని నీళ్ళు పట్టానుగాని ఆనీళ్ళు వేడిగాఉన్నాయి. ఛీ ఈ వేడినీళ్ళు ఆవిడకు ఇయ్యటం ధీరలక్షణం కాదనుకొని, ఆ చెంబుతీసుకొని రైలులో సోడాఅమ్మే పెట్టెదగ్గరకు వెళ్ళాను. స్పెన్సరు సోడాఒకటి గ్లాసులో పోయించుకొని, అందులో కొంచెం తీపికలిపించి, కొంచెం మంచుగడ్డ వేయించి పట్టుకెళ్ళాను. అయిదు అణాలు చెల్లించాను అనుకోండి, అది వేరేవిషయం

ఆమెకు సోడాఇచ్చి "పుచ్చుకోండి నీరు వెచ్చగా ఉన్నయి. దాహంతీరదు" అన్నాను. "అయ్యో! చాలా శ్రమపడ్డారే" అని, సోడా తీసుకొన్నది. ఏదో పరోపకారంచేస్తున్నానని నాకు నేను సమాధానం చెప్పుకొని, "అ, ఏమిశ్రమ తెండి" అన్నాను; ఏదో సామాన్యంగా అట్లా స్నేహితులకూ; పరిచయులకూ నిత్యం

సోడాలుఇచ్చే ధనవంతుడ్నిలాగచూస్తూ. ఆమె ఆ గ్లాసులోని అమృతంలాంటి సోడాతాగి చేతిరుమాలుతో తుడుచుకొంటూ ఖాళీగ్లాసు నాకిచ్చింది. నేను ఆగ్లాసును సోడా విక్రయంచేసినవానికి ఇచ్చేశాను. నాకూ దాహం అవుతున్నది. కాని సోడాపుచ్చుకొంటే డబ్బు అయిపోతుందని ఆవేడినీళ్ళే కాసిని త్రాగి మళ్ళీ యథాస్థానంలో కూర్చున్నాను. బండి కదిలింది. ఆవిడతో పరిచయం కలిగినందుకు నాలోనేను సంతోషించాను. ఆవిడను ఎన్నోప్రశ్నలు అడుగుదామనుకొన్నా. కాని ఆవిడ అడిగిన ప్రశ్నకల్లా క్లుప్తమైన జబాబు చెప్పటం, కొన్నిప్రశ్నలకు జబాబేచెప్పక చిరునవ్వు నవ్వి ఊరుకోవటం నా కంతప్రోత్సాహకరంగా ఉండలేదు. కాని ఆమెకళ్ళు మహాచెడ్డవి. అవి నన్ను లెక్కలేనన్ని ప్రశ్నలువేసినవి దారిపొడుగునా, నాకళ్ళు ఆ ప్రశ్నల కన్నింటికి సావధానంగా జబాబు చెప్పినవి. ఇంతలోకే బెజవాడ వచ్చాము.

స్టేషనులో రైలుదిగాము. తెనాలివెళ్ళే మెయిలుకు ఇంకా గంటన్నరటైముంది. అక్కడే కూర్చుందాం అన్నాను. ప్లాటుఫారంమీద కూర్చుంటే వచ్చిపొయ్యే వాళ్ళు ఎగాదిగా చూస్తారండి. వెయిటింగురూములో నన్ను కూర్చోబెట్టండి అని ఆమె వినయంగా కోరింది. అల్లా స్త్రీ కోరుతుంటే ఎవ్వరు కాదనగలరు?

ఆవిడవద్ద రెండుపెట్టెలు ఒకపరుపుచుట్టా ఉన్నవి. అవి వెయిటింగురూముకు చేరాలి కూలీ మూడుపావలాలకు తక్కువైతే వాటిని ముట్టుకోనన్నాడు. అన్నాడు వాడు చక్కాపోక అక్కడే నిలవబడి వచ్చినవాడితో నల్లా నేను మూడుపావలాలియ్యమన్నారా, అయ్యగారు సందేహిస్తున్నారు అనటం మొదలు పెట్టాడు, ఆకొత్తగావచ్చినవాడు ఇచ్చేసెయ్యండి బాబూ, అంతకు తక్కువ కెవ్వరూరారు అని సిఫార్సుచేసి పోవటం నాకేం తోచిందికాదు. ఇంతలో ఆవిడ ఒక పెట్టె నెత్తుకొని వెడదాంరండి అన్నది. మొగవాడ్ని దగ్గర ఉండి కూడా సుకుమారిచేత పెట్టెమోయించటం అనుచితము అనితోచి "మీరెందుకూ? నే పట్టుకొస్తాను ఇల్లా ఇవ్వండి" అని, ఆవిడ రెండుపెట్టెలూ నాభుజానపెట్టుకొని నాపెట్టె చేత్తోపట్టుకొని ఫర్లాంగుదూరంలో ఉన్న వెయిటింగురూముచేరేసరికి బుజాలు పీక్కునిపోయినాయి. నడుము కలకబారి నొప్పెట్టింది. చెప్పవద్దూ ఒకచిన్న సూట్కేసయినా మోసిఎరగనారు. వెయిటింగురూములో ఆవిడను కూర్చోబెట్టాను మూడవతరగతి ప్రయాణీకులు అక్కడ కూర్చోకూడదు. కాని అక్కడ ఉండే మనిషికి ఒక పావలాయిచ్చి సంతోషపరిచాను. చాలాఘనకార్యంచేశాను. ఇంతా కష్టపడ్డా, ఆవిడ వెయిటింగురూములోపల నేను బయటూనా? అని కష్టమేసింది మనస్సులో.

నడుములు విరిగిపోతుంటే బయట ఉకతినశిలలపైన నడుమువాల్చి లోపలఆవిడ నేను చేసిన ఏర్పాటుకు ఫలితంగా సోఫాలో, ఎలక్ట్రిక్ ఫాన్‌క్రింద పడుకోటం చూశాను. నేను వెర్రివాడిని అయినానా ఏమిటి? ఎవరినో ఒక ఆవిడ పెట్టెలు మోయటమేమిటి! ఈకర్మం ఏమిటి! అని అనుకొన్నాను. ఇంతలో ఆమె నొసలూ, కళ్ళూ, పెదవులూ నా ఎదుట నిలువబడి, అల్లా అనుకోక. ఎంత సరదా! అన్నాయి. ఎట్లాయితేనేం మళ్ళీ ఆఊహే రాలేదు.

ఆకలి అవుతున్నది, హోటలుకు వెళ్ళి రెండు మెతుకులు తినకపోతే బ్రతికేటట్టులేదు. వెంటనేవెళ్ళి భోజనంచేశాను. నేను భోజనంచేసి ఆవిడకు తీసుకొని పోకపోతే మర్యాదకాదని తోచింది అందుకని టిఫిన్ కారియర్‌లో భోజనంపెట్టించుకొని ఆవిడకోసం తీసికెళ్ళాను. ఆవిడ "అయ్యో, ఎంతశ్రమపడ్డారండీ" అని అంటూ కారియర్ అందుకొని అక్కడే పెట్టుకొని భోజనంచేసింది. కావలసినవనీళ్ళు అవీ నేనే తెచ్చి ఇచ్చాను. అటుతరువాత ఆగిన్నెలుకడిగి హోటలువాడికి ఇచ్చేసినాను. నాకర్మంకాలితే ఎంగిలిగిన్నెలు కూడా కడిగాను! అయితే ఇదంతా రోమాన్సు గాలం స్త్రీ అనే పదాలలో శరణ్యంపుచ్చుకొని అంత అసహ్యం అనిపించవు.

భోజనానంతరం ఆవిడ ఏమిటో చేతిలోకి తీసికొని నావంకతిరిగి "ఇదిగో తీసికోండి" అనినట్లు సంజ్ఞ చేసింది. పోకచెక్కో ఏమిటో ఇయ్యావస్తున్నదనుకొని

ఆగులాబిరేకులవంటి మెత్తనిచేతులు తగలటంవల్ల కలిగే స్పర్శసౌఖ్యం ఊహించుకొని ఆనందంతో చెయ్యి జాపాను. ఆమె తనచేతిని నాచేతికి తాకనియ్యకుండా, తాకితే ఎలక్ట్రిక్ షాక్ తగిలి చచ్చిపోతాననుకొందో ఏమోమరి ఎత్తి నాచేతిలో పడేశింది రాగిడబ్బు ఒకటి; "కిళ్లీ కొనుక్కోరండి" అన్నది నవ్వుతూ! నాకు అరికాలుమంట నెత్తికెక్కింది. ఇందాకటినుంచీ సోఫారు, భోజనానికి డబ్బు కర్చుపెడుతూ అడ్డమైన చాకిరీ చేస్తుంటే విశ్వాసంలేకుండా కిళ్లీకని ఒకరాగిడబ్బు ఎత్తి చేతిలో వేస్తుందా! అదీ ఒక్కకిళ్లీకేనా? అని ఉక్రోషంవచ్చింది.

నాముఖంలో ఉండే కవళికలు తెలియజేసే భావాలను ఆమె గ్రహించింది. ఒక్కనవ్వు నవ్వింది. మచ్చుమందు చల్లినట్లయింది! మళ్ళీ మాట్లాడకుండా, ఆ కానీ ఆమెచేతిలోకి గిరాటుపెట్టి, కిళ్లీదుకాణం దగ్గరకెళ్ళి అర్ధనా, అర్ధనా కిళ్లీలు మంచి సుగంధవస్తువులతో కూర్చినవి రెండు కట్టించుకొనివచ్చి ఒకటి ఆమెకుచూపి ఇస్తాను రమ్మని పిలిచాను. ఆమె అక్కడికే గిరాటు వెయ్యమని సంజ్ఞ చేసింది కోపంతో విసిరాను ఆమెపైకి. ఆమె నవ్వుతూనే, తీసుకొని ఊరుకొన్నది.

మళ్ళీ రైలుటైము అయింది. తెనాలివైపునకు వెళ్ళే మెయిలు వచ్చింది. మళ్ళీ ఆవిడ పెట్టెలను రైలుపెట్టెలోకి తోశాను. ఇద్దరం ఒకపెట్టెలోనే ఎక్కాము. ఆవిడప్రక్కనే కూర్చున్నాను. ఇంత అవస్థపడ్డందుకు ఆవిడ నామీద కృతజ్ఞురాలై యుంటుందనుకొని ఏమిటో మాట్లాడాలని ఆవిడకు దగ్గరగా జరిగాను. కుచ్చెళ్ళచెరుగులు దగ్గరకు లాక్కొని, ఒదుక్కొని "చూడండీ కొంచెందూరంగా కూర్చోండి" అన్నది మెల్లగాసన్నని గొంతుకతో రెండోవాడికి వినపడకుండా. దానితో నాప్రాణాలు చల్లబడ్డవి. నేనెందుకు నాగౌరవాన్ని చంపుకుని ఈవిడకు అరవ చాకిరీ చేస్తున్నానా అని విచారంకలిగింది.

తెనాలిస్టేషను వచ్చింది. నేనుదిగి నాపెట్టె దింపుకుని ఆమెకేసిచూస్తూ "దిగరేం" అన్నాను. "ఇక్కడ కాదు లెండి నేను దిగటం" అన్నది. ఆమాట వినేసరికి నాపైన పిడుగుపడ్డట్లయింది. తత్క్షణం నాపెట్టెను చేత్తోపట్టుకొని వెళ్ళిపోతూ ఆవిడవంక తిరిగి ఉక్రోషం పట్టలేక కసిఅంతా తీరేటట్లుగా వెక్కిరింతగా నానా వికారపుచేష్టలూచేసి బైటకు వినపడకుండా తిట్టుకొన్నాను. ఆవిడ ఏమో అనోస్తుంటే వినిపించకోలేదు. ఆవిడ పకాపకా నవ్వింది.

డబ్బుఅంతా ఖర్చు అయిపోయింది. పెట్టెను మోయటానికి కూలీని పెట్టుకొందామన్నా దమ్మిడీలేదు. బండి కట్టించుకోటానికి అసలే లేదుగదా! పోనీ ఇంటివద్ద మావాళ్ళనుఅడిగి ఇయ్యకూడదా అనుకొంటే వెళ్ళేది అత్తగారింటికి. వెళ్ళటం వెళ్ళటం అర్ధనా డబ్బులు అప్పు అడగటంకంటె చండాలప్పని ఇంకేముంది. ఆపెట్టె నెత్తినేసుకొన్నాను. ఇంటిదారిపట్టాను.

బెజవాడ స్టేషనులో పెట్టెలు మోయటంచేత, బుజాలు, నడుమూ పీక్కునిపోతున్నది. శ్రీరామమూర్తి జ్ఞాపకానికి వచ్చాడు. రామస్మరణ చేయాలనుకొన్నాను. కాని ఆ నోసలూ, ఆకళ్ళూ, ఆఎర్రని పెదిమలూ తొంగిచూస్తున్న నవ్వూ, నాఎదుట ప్రత్యక్షమై నన్ను ఊహు వెక్కిరించటం మొదలు పెట్టినవి. రామస్మరణ ఎట్లా సాగుతుంది ?

మునిమాణిక్యం నరసింహారావు



# చాందు రాణి

## ౧

ఎల్లపుడు పతిని ప్రేమించుట, సేవచేయుట, తన ఇచ్ఛను వానికోరిక కనుకూలముగ మార్చుకొనుటయే స్త్రీల ముఖ్యస్వభావమని సేటు దేవీచరణుడు తెలిసికొనియుండెను. అతను ముగ్గురిని వివాహమాడియుండెను. వారివలన యీసిద్ధాంతముకు కనిపెట్టియుండెను. కాని అతను ఎపుడు నాల్గవవివాహము చేసికొనెనో, చాందురాణి యెపుడు వీనిగృహప్రవేశ మొనరించెనో, అపుడు స్త్రీస్వభావము అగాధసముద్రమనియు, దాని అంతుచేరుట ఎవరికిని సాధ్యముకాదనియు తెలిసికొనెను.

చాందురాణి సార్థకనామధేయయు, ప్రసన్నవదనయు, స్వచ్ఛందయు, చంచలయునై యుండెను. హాస్యమందు చంద్రప్రకాశము, సంభాషణమందు మాధుర్యము, క్రీకంటివీక్షణముల శీతలమును ఘనీభవించియుండెను. ఆమె వైపెవరు చూచెదరో వారు చూచుచునే యుండెదరు. చిరకాల పరిచయముగలదానివలె అందరితో కలిసి మెలిసియుండును. ఈ గుణములచే దేవీచరణుడు ఆమెకు వశుడైనపిమ్మట తనయింటి కామెను తీసికొనివచ్చుట సులభముగా నుండెను. అతను కోటీశ్వరుడు. తలచినది చేయకలడు.

సేటుగారి ముగ్గురిభార్యలతో చాందురాణి పరిచయముకలదానివలె మాట్లాడుటకు ప్రారంభించెను.

“అక్కా! నీవుండగా వారు రెండవవివాహము ఎందుకు చేసికొనిరి?” అని మొదటిభార్య నడిగెను.

“నాకు బిడ్డలులేరు.”

“అసత్యము. పురుషులు సంతానమునకై వివాహమాడుటలేదు.”

పెద్దభార్య యీవిషయము పలుమారు చెప్పతలంచెను. కాని చెప్పజాలకుండెను. రాణిమాటలయందు మాధుర్యమేగాక సత్యముగూడ కలదని ఆమె యనుభవముగలన తెలిసికొనెను. ఆమె బదులుపలుకలేదు. చాందువైపు దీనముగా చూచుచుండెను.

“అక్కా! నీవు సుందరివి, మంచిదానవు. సేటుగారిని రెండవ పెండ్లాడుటకు నిరోధము కలిగించలేదా?” అని రాణిఅడిగెను.

పెద్దభార్య హృదయము పొంగిపొరలెను. “ఎవరిబలముపై నాపేదను. నంటిబిడ్డగూడ లేకపోయెనే.” అని ఆమెకంఠమునుండి మొదటిసారి వినబడెను.

“అక్కా నీ అపరాధము క్షమించతగినదికాదు. పెద్దక్కయుండగా నీ వీవైపేల తొంగిచూచితివి?” అని చాందు రెండవభార్య నడిగెను.

“నేను బీదింటిదానను. నాకేమేదియులేదు.”

“మంచిది, కాని కాపురమునకు వచ్చినపిమ్మట, పెద్దక్కయ్యతో చేరి, చీటికి మాటికిచేయి యీదురాన్యాయపాశమునుండి సేటుగారిని ఎందులకు మరల్చలేదు?”

“నేను బీదింటపుట్టితిని. నాయందేకొంచెము లావణ్యము కలదో, అదిఅంతయు భగవానుని వలన కలిగియుండెను. భగవంతుని సౌందర్యమునకును, మనుష్యుడిచ్చిన సౌందర్యమునకును, మిక్కిలి తారతమ్యము కలదని యిపుడు చూచుచున్నాను. బీదింటిబిడ్డకు శృంగారము, హావభావము లెచ్చట అబ్బును? నాతలిదండ్రులు కపటపునవ్వును, ఏడ్పును నేర్పించియుండలేదు.”

చాందురాణి నవ్వుచు చెప్పెను. “నిశ్చయముగ చెప్పితివి. చిన్నక్కా! యీయిద్దరి అబలల కవళమునకు ముసలమువలె నేల దాపరించితివి? నీకన్ననో భగవంతుడన్నియు నిచ్చియుండెను తల్లిదండ్రు లన్నియునిచ్చిరి. ఇటుల చదువను, వ్రాయను నేర్చిన నవనారీమణివి, యీవలయందేల చిక్కితివి”

చిన్న పెండ్లాము పరిభవింపబడిన దానివలె కృత్రిమమగు చిరునగవుతో చెప్పెను:—“ప్రేమచే వారు నన్ను ప్రేమభిక్షకోరిరి. కోటీశ్వరుడు బిచ్చగానివలె నావద్ద హస్తము చాచెను, నాకు జాలి కలిగినది.

నిజముగ దయ గలిగినది. నేను నవలలను అధికముగా చదివి యుంటిని, ప్రేమబాధ యెట్టిదో, నవలల వలన నేను తెలిసికొని యుంటిని స్త్రీప్రేమను పురుషుడు పాత్రుడు కాడో, అతని ప్రకారము పనికి మాలిన వాడైపోవునో, వందలకొలది యుదాహరణములు నాకు జ్ఞప్తికలవు. మఱి, ఇంతటి గొప్పవాడు స్వల్పవిషయమునకై ఏల చెడిపోవలయునని, నేను యోచించితిని. తల్లిదండ్రులును తెలియజెప్పియుండిరి.”

“రావణుని కథ చదివితివా? అతను గూడ సీతను ప్రేమభిక్షకోరియుండెను.” అని చాందురాణి అడిగెను.

చిన్నభార్య:—అవును, అతను కోరతగియుండెను. ఒక్కొకడు స్త్రీలను ప్రేమభిక్షగోరతగియున్నాడు. ఇప్పటివరకు నవలలు చదువుచు, యీ సారాంశమును నేను గ్రహింపగలిగితిని. నవలల యుద్దేశమిదియే.

“అయ్యో! నవలాపాఠకులారా! ఎవరైన యిటువచ్చి, నీతో, సుందరీ! సేటుగారిని వదలి నాతో లేచి వచ్చెదవా? అని యడిగినపుడు, నీవు లేచి వెళ్ళెదవా!” అని పెద్దభార్య అడిగెను.

“మఱి అతని ప్రేమ యందంతశక్తియుండినచో, —నేనన గనెంత, పతివ్రతయగు సావిత్రి గూడ ఆకర్షింపబడును.”

రెండవభార్య:—అట్లయిన సీతతప్పుచే యుండెను కదా?

చిన్నభార్య:—రామాయణమందలి ఆకథాఘట్టమును చదువునపు డంతయు, అవశ్యము, సీత రావణుని కనికరించి యుండవలసినదని, యోచించుచుందును.

చాందురాణి—(నవ్వుచు) ఆహా! ఎక్కడి విషయము యెక్కడికి వచ్చెను.

“చిన్నక్కా! అతను వాస్తవముగ ప్రేమించిన వాడు కాడు. దుష్టుడు. స్త్రీ తనసత్యప్రియుని (ప్రాణనాథుని) గుర్తింపవలసి యుండును.”

చిన్నభార్య:—(కొంచెము విరక్తితో) భేష్! బాగుగా చెప్పితివి, చెల్లెలా! విచారించనిది, తెలిసి కొననిది, పురుషుని మాటలయందు చిక్కనదానికి, గొప్పఅవమానమును భరించవలసి యుండును. సీతయుగమందు నవలలు లేవని తోచుచున్నవి. అందువలన ఆమె రావణుని బారినుండి రక్షింపబడినది. కుత్సితులగు పురుషులు తమనవలాతరంగముల మూలమున స్త్రీ హృదయమందలి దృఢాశయములను భేదించి, యిసుకగా చేసివైచిరి. ఇపుడు సామాన్యమగు తరంగము సైతము దానిని గ్రహించి ఎచటనో ఒకచోట విసిరి వేయగలదు.

చాందు:—చిన్నక్కా! ఇపుడేమిచేసెదవు?

చిన్న:—ఇపుడు నాలోననేమి యున్నది. నీవు నాగర్వమును పెనురాతిని చూర్ణము చేసితివి.

చాందు:—సేటుగారు నీ యందేలోపమును చూచి నాల్గవవివాహ మాడెను?

చిన్న:—నాకు తెలియదు.

కొంతసే పందరు ఊరకుండిరి. మరల చిన్నభార్య:

“చెల్లెలా! ఇంత తెలిసియు నీ విచటి కేల వచ్చితివి? మఱియు అయిదవదానిని తెచ్చిన నీ వేమిచేసెదవు?”

చాందురాణి బిగ్గరగా నవ్వెను. “ఆహా - మీరందరు నన్నిప్రశ్న వేయుదురని నాకు తెలియును. వ్యర్థముగా ఈకార్యము చేయుటకు వారు ఎట్లు సాహసింపకుందురో, అటుల సేటుగారి చక్కపెట్టుటకు వచ్చియున్నాను. ఇందరి స్త్రీలను కష్టపెట్టినందులకు వారిని నేను తగినటుల దండించుటకు నిశ్చయించితిని. చెప్పుడు చూతము. మీరందరు నాకు సాయముచేసెదరా?”

వా రందరు ఆశ్చర్యచకితులై ఆమెవంక చూడసాగిరి. “తప్పు, తప్పు, ఇప్పుడేనుంటివి? భర్తవిషయమై ఇట్టి పదప్రయోగమా?” అని పెద్దభార్య అరచెను.

“ఏమియు నక్కరలేదు నే నంతయు ఒంటిరిగా చేసెదను” అని చాందురాణి చిరునవ్వుతో ననెను.

౨

దేవీచరణుడు తనగదిలో వార్తాపత్రిక చదువుచుండెను. క్రిందలిఖించిన “వివాహావిజ్ఞాపన” పై ఆకస్మికముగా నతనిదృష్టి ప్రసరించెను.

“సజ్జనులారా!

నాభర్త నాల్గు వివాహము లాడెను. కాని యెవతెయందును సంతానము కలుగలేదు. నేను వారినాల్గవ భార్యను. నాభర్తయందే లోప ముండినకారణమున మా కందరకు సంతానము కలుగ లేదని నాకనుమానము గ [illegible] నున్నది. ఇందుకొఱకే, నేను రెండవవివాహము చే

నికొనుటకు వాంఛించుచున్నాను. సంతానమునకై ఎన్ని పాట్లయినను పడవచ్చును. పర తింటిరాయి, నూతనప్రియుడు నాగృహామం దుండవలయును, మఱియు నన్ను నా యిప్పటి భర్తనుండి విడదీయరాదు. సాహసులగు సజ్జనులు దీనిని గమనించెదరుగాత!—చాందురాణి.”

విజ్ఞాపనచదువగనె సేటుగారు భయముచే వణకుచుండిరి. వాని చేతినుండి వార్తాపత్రిక జారిపడెను. అతను తన అంతఃపురము వంకకు నడువసాగెను. అతని నూతనముఖభావములను చూచి కాసాలు, దాసీలు ఏమియు నడుగజాలకుండిరి. దేవీచరణుడును వారి నేమియు పలుకరించలేదు. అతనుతిన్నగా చాందురాణి గదికి వెళ్లెను. ఆమె అక్కడ లేకుండెను. అప్పు డతను తనఇతరభార్యలగదులకు వెళ్లెను. కాని యెవరిజాడయు తెలియరాదాయెను దుఃఖితుడై, క్రోధముతో తిరిగి తిరిగి వారి అంతఃపురవాటిక చేరెను. నలుగురు భార్యలు బెంచీమీద కూర్చుండి వర్షాకాలమందలి ప్రభాతాతపసుఖము నానందించుచుండిరి. వెనకప్రక్కగా వచ్చుటచే సేటుగారిని చూడక నలుగురు భార్యలును ఏదోమాటపై చిరునగవు నవ్వుచుండిరి. నలుగురు ఎడమవైపు వరుసగా కూర్చుండిరి

“చెల్లెలారా! మీకు ఈనవ్వు మంచిదికాదు.” అను సేటుగారిపెద్దభార్యవాక్య మాకస్మికముగా వినబడెను.

“పరిహాసమేల! పెద్దక్కా! నేను నిజమే చెప్పుచున్నాను. నలుగురుకాదు. పదునైదుగురు రానిమ్ము. సేటుగారు పుట్టించదలచిన ఒక చిట్టెలుక గూడ పుట్టదు దీనికి బలముకావలయును. తపస్సుకావలయును.” అని చాందురాణి చెప్పెను.

మధ్య:—ప్రపంచమున అందరు బలవంతులు కారు, తపశ్శాలురుకారు.

చాందు:—అందరును నాల్గు వివాహము లాడియుండలేదు.

చిన్న:—వారుసంతానమునకుగా వివాహమాడలేదు.

“అట్లయిన నిష్కపటముగ నేల చెప్పకూడదు, పుణ్యాత్ముడు. సచ్చరిత్రుడుగా నుండుటకు యీకపటనాట్య మెందులకు” అని చాందురాణి లేచి పలికెను.

పెద్ద:—పురుషు డన్నియు చేయగలడు. కాని స్త్రీ అన్నియు చేయుటకు స్వాధీనురాలు కాదు చేసినను శోభించదు.

చాందు:—ఏమైన కానిమ్ము. నేను రెండవ వివాహ మాడెదను. మాయుమునుపు వలన నాకు సంతానము తప్పక కలుగునని విశ్వాసమున్నది.

సేటుగారు నిలువజాలకపోయెను. ముందునకు వచ్చిచెప్పెను: “ఇటుల మాట్లాడుటకు ఇచట కేలవచ్చితివి. కోరినదంతయు వెలుగలనుండియే చేయవచ్చునుగదా?”

“నీవు నన్నిచటి కేల తెచ్చితివి? అబ్బా! సంతానముకొఱకు మీరు నాల్గువివాహము లాడవచ్చును, కాని నే నొకటియు చేసికొనకూడదా?” అని చాందురాణి తల నించుక ఒయ్యారముగ విసరెను. మిగతభార్యలకు నవ్వు వచ్చెను. సేటుగూడ నవ్వుచు “మంచిది. చేసికొనుము. ఎవనిని వివాహ మాడెదవు”

చాందురాణి పైటలోనుండి కాగితములను తీసి చెప్పెను. “నా విజ్ఞాపనను ప్రత్యుత్తరముగ నూరుత్తరములువచ్చినవి. వాని నుండి నేను పదుగురి నేర్పరచితిని. వీరిలో ఒకరిని వరించవలయును. మీయందరి అభిప్రాయమునుగైకొని వరించుట మంచిదని నిర్ణయించితిని. మీ రాలోచించి చెప్పుడు, చూతము.”

సేటుగారు చాందురాణిచేతినుండి కాగితములను లాగివైచి, వానినిచూచెను. వానిశరీరము తుపానువలె వణికెను. —క్రుద్ధుడై రెండుబొటనవ్రేళ్లతో కాగితములను ముక్కలు ముక్కలు చేసి వైచెను. కురూపి! పిశాచి! నాయింటనుండి వెళ్లుము.” అని పెద్దగా నరచెను.

చాందురాణి దృఢముగ జవాబిచ్చెను: “దయ్యమా! మాపాలిటిమృత్యుదేవతా! నాయింటి నుండి వెళ్ళుము.”

స్త్రీముఖమునుండి ఇట్టిమాటలు వినుటకు సేటు అలవడి యుండలేదు. క్రోధావేశమువలన అతను చాందురాణిని చెంపపెట్టు పెట్టెను.

చాందురాణియు మారు చపేటిక నిచ్చెను. ఇంకను ఇద్దరకు పోరాట మగుచుండెను. మధ్యభార్యయు, చిన్నభార్యయు భయముచే నచటనుండి తొలగిరి. “పరుగెత్తుడు; పరుగెత్తుడు; సేటుగారి ప్రాణములను తీయుటకు ప్రయత్నించుచున్నది. ఈ పర్యాయము మృత్యువును వివాహమాడెను.” అని పెద్దభార్య అరచుటకు ప్రారంభించెను.

# 3

చాందురాణిని బుజ్జగించుటకు, ఆమెకు తెలియచెప్పుటకు సేటు ఆమెతల్లిదండ్రులను పిలిపించెను కాని వారిమాటలు వినియుండక నె-"తల్లిదండ్రులఆజ్ఞ పాలించుట యందును హద్దుకలదు. మీఆజ్ఞ హద్దుమీరినదని నేను తలచుచున్నాను. సేటు దేవీచరణునికి నన్నిచ్చి వివాహము చేసిన పిమ్మట మీరు వారికి బుణగ్రస్తులు కారు. మీరు నాకు చదువను, వ్రాయను నేర్పించిచిరి. ఆలోచించుటకు, తెలసికొనుటకు బుద్ధినిచ్చితిరి. ఇందులకు మీకు నేను కృతజ్ఞురాలను ఇపుడు నాదారి నన్ను చూచుకొననిండు. లోకాపవాదవిషయమటుంచుడు. నేను దానిని లక్ష్యపెట్టుటలేదు. నాల్గు వివాహము లాడిన సేటుగారి నేమియు చేయజాలని లోకాచారము నన్నేమి చేయగలదు' నేను ద్వితీయ వివాహ మాడనిది ఉండజాలను ఎవరైనను సాహసముగా సిద్ధపడవలయును ఇదియే కోరిక."

చాందురాణి తల్లిదండ్రులు చేయునదిలేక తిరిగి వెళ్లిరి. మెల్లమెల్లగా ఈవివాహవార్త చాలదూరము వ్రాకెను. చాందుపక్షమును సమర్థించువారును చాల మంది లభించిరి. ఇట్టి పరిస్థితులలో స్త్రీ పునర్వివాహ మాడవచ్చునని కొందరు శాస్త్రప్రమాణములగూడ నుల్లేఖించిరి. చివరకు దేవీచరణుడు రాణిని ఒకగదియందు బంధించెను. కష్టపెట్ట సాగెను. కాని ఆమెలావణ్యము దిట్టిప్రేమను కలుగజేయుశక్తియుండుటచేత సేటు చాలకాల మిటుల చేయజాలకపోయెను. ఒక దినము మెల్లగా చాందురాణి గదికి ఒంటరిగావెళ్లి "చాందు !...నామీద దయయుంచుము"అనియెను.

చాందు:—మీరేల నామీద కొంచము దయయుంచ కూడదు. వహ్వా; పురుషజాతి! పుచ్చుకొనుటకు తెలియును, కాని యిచ్చుట కేమియు నెరుగదు.

దేవీ:—నీ మూర్ఖపుపట్టుదలమూలమున నా గౌరవ మెటుల మంటకలియుచున్నదో, మర్యాద సన్నగిల్లుచున్నదో తెలియునా?

"అబ్బా! మీకును మంచిచెడ్డల ధ్యానము కలదా?"

"చాందు! నీ కోరిక కోరెదవు?"

"ఇంకొకపెండ్లి చేసికొని మీకు సంతానసుఖము నిచ్చెదను."

"ఇట్టి సంతానసుఖమును నేను కోరుటలేదు. దీనికి నేను ప్రబలశత్రువును."

సేటుగారి ముగ్గురు భార్యలు అచటికి కేతెంచిరి.

పెద్ద:—పెండ్లి చేసికొనుము.

మిగతఇద్దరు:—పెండ్లి చేసికొనుము.

చాందు:—లేదు, మీరిపుడు పెండ్లి యాడవలదు, మమ్ములను చేసికొననిండు.

ఈశ్వ్యంగ్యోపదేశమునువిని దేవీచరణుడు కొగడిపాలవలె పొంగెను. అంతట తన తలను దబదబ బాదుకొనసాగెను.

పెద్దభార్య అతని చేతిని పట్టుకొనెను. నడిమిభార్య తడివస్త్రములో అతనిముఖమును తుడచెను.

చిన్న:—సేటుగారు! నేనే మీకుగానుండిన, ఇంతటి వ్యాకులమును మీరు ఈమెను ద్వితీయవివాహమునకు పురికొల్పియుండెడి దానను.

దేవీచరణుడు లేచి కచ్చేరిచావడివైపు వెళ్లెను. మొదటిభార్య లిద్దరు అతని ననుసరించిరి.

చిన్న:—చాందు! అయిన దేమో అయినది. హఠమును వదలుము. నీ మాటలను వారు ఎంతవరకు సహించుచున్నారో, చూడుము. ఇటుల నన్నెవరైన పరాభవించిన నా ప్రాణములు విడచియుండును.

చాందు:—నేనేమి అనుచితము లాడుచున్నానా? దేనికొరకు వారు నాల్గువివాహములాడిరో, దానికే నేనును పెండ్లిచేసి కొనెదను ఆ విషయమున వారెంతి స్వతంత్రులో, నే నంతటి స్వతంత్రురాలను.

చిన్నభార్య బాధకసాధకములను తెలియచెప్పెను. వ్యాజ్యపుగొడవలు వ్రవ్వెను పురుషునికిని స్త్రీకిని గల భేదమును చూపెను. పతి యిష్టప్రకారము ప్రవర్తించని భార్యను యింటినుండి తరిమివేయగలడు. రక్షక శాఖవారిసాయమున ఇట్టిపెండ్లిని ఆపగలడు. అతనికి సర్వాధికారముకలదు. కాని, స్త్రీ కట్టిఅధికారములు లేవనియు చూపెను,

"లేదు కాని, అక్కా! ఏ పురుషుడు తనస్వేచ్ఛకొలది వర్తించునో, వాడు పత్నీప్రేమకు పూర్ణపాత్రుడు కాడు. నాసంబంధము నిశ్చయమైనది. మఱియొక స్వజనుని ప్రేమసూత్రము నాహృదయమును బంధించివైచెను. ఈ పుష్పము మఱియొకవిగ్రహమున కర్పింపబడినది. అచ్చటనుండి పతనమైనది. లేదు పతితమైనదిగా చేయబడినది. ధనబలముచే లాగివేయబడినది. అయినను ఇపుడు చక్కగా నెందులకు అలంకరింపరాదు. ఇంతకాల మెందులకు పడియుండవలయును.- మఱియు నాప్రియుడు వచ్చియున్నాడు నాతో కష్టసుఖములను భరించుటకు అతను సిద్ధముగా నున్నాడు. ఈహృదయము అతనికి సమర్పింపబడును. ఇక, శరీరమా? దీనిని సేటుగారు కొనియుండెను. ఈకారణముచే నీశరీరము, దీనినుండి ఏవి యుత్పన్నమగునో అవియు సేటుగారివని పిలువబడును." అని చాందురాణి స్వాభావికమైన నవ్వుతో చెప్పెను.

చిన్నభార్య చాల నవలలు చదివి యుండెను. కాని ఈసమస్యవిషయమై ఆమె ఎప్పుడును ఆలోచించి యుండలేదు.

## ౪

రెండుసంవత్సరములకు పిమ్మట చాందురాణి పురిటిపాపను తీసుకొని వచ్చి నిశ్శబ్దముగా సేటు దేవీచరణుని ముందునిలిచెను. తల్లిచేతులనుండి వేరుపడుట వలన బిడ్డ కావు కావు అని పోరుపెట్టసాగెను. సేటుగారి మిగతభార్యలు రోదనమును విని, అచటికి వచ్చిరి చాందురాణి ప్రసవించినదని ఇచట కొన్నిదినములనుండి పుకారుగానుండెను. కాని, జాడ దెలియదాయెను. ఇపుడు ఆకస్మికముగా ఈ దృశ్యమును చూచినవారు చాందురాణి సాహసమునకు మితిలేని ఆశ్చర్యమును పొందిరి. చాందురాణిని చెప్పినదంతయు చేసి చూపుటకు శక్తిచాలినదానిగ తలచుచుండిరి. కాని, యీపమ్మెళనముతో వారిభ్రమ తొలగిపోయెను.

చిన్న:—పిచ్చిదానా! మాకుగూడ నీ విషయమును దాచితివేల? వారు కోపమున బిడ్డనెత్తివేసి నట్లయిన?

చాందు:—ఇదియే మాకు తగినది, వారు బిడ్డను స్వీకరించెడి పక్షమున, సంతానమునకు వివాహమాడ లేదని రుజువగును.

సేటు పటపట పండ్లు కొఱుకుచు కోపముతో "చాందు! ఇది నీకు కళంకము." అనియెను.

చాందు — కళంక మెవరియందును లేదు. మీకు నేను కళంకురాలను, మీరు నాకు కళంకులు. ఈసృష్టియందు సర్వథా కళంకమే శోభగా నున్నది. ఎవడు కళంకరహితముగ జీవితమును గడుప యత్నించునో, వాడు రెంటికిగుడ్డిగవ్వలకు గూడ కొరగాడు.

దేవీ:—వీనిని తీసికొని వెళ్ళుము. నేను చూడజాలను. కోపముతో పరవశుడను కావచ్చును. అట్టిసంఘటనమును రానివ్వకుము. లేనియెడల అనర్థము తన శక్తినంతను చూపగలదు.

చాందు:—నేను ముందువెనుక లాలోచించితిని. ఎంతకైనను సంసిద్ధురాలనె.

దేవీచరణుడు చాలసే పటునిటుచూచెను. పండ్లుకొఱుకుచు, వణకుచున్న హస్తములతో ఏడ్చుచున్న బిడ్డనెత్తుకొని "ముక్కుపచ్చలారని బిడ్డా నిన్ను నాక్రోధమునకుబలిగా నెందులకు చేయవలయును పెద్దవాడవైన పిమ్మట నీ వంతయు వినుట, తెలిసికొనుట, తటస్థింప వచ్చును. నీవు బ్రతికి అవమానాగ్నియందు భస్మమగుటయే నీ వ్రాతఫలము...చాందు నేను మూడు వివాహములాడువరకు ప్రపంచము స్వస్థానమున నుండెను. ఏదినము నేను నాల్గవ వివాహమాడితినో, ఆదినమే భూగోళము ఆదిశేషుని పడగలనుండి తొలగి మఱెచ్చటనో పడుచున్నదని తెలిసికొంటిని. కాలము మారినదనియు స్త్రీలు దానితోపాటుమారిరనియు తెలిసికొనగలిగితిని. మర్యాద మంటకలసినది. మఱి యింకేమిపోవును! అంతయు భరించెదను. ఇక పెండ్లి ఆడనే ఆడను."

చాందు — పెండ్లి చేసికోనని ప్రతిజ్ఞ చేసెదరా!

దేవీ:—ముమ్మాటికిని.

"మంచిది. ధ్యానముతో కొంచెము చూడుడు. బిడ్డ కాదు-బొమ్మ! పరుండబెట్టిన యేడ్చును. కూర్చుండబెట్టిన నవ్వును (అనువాదము.)

# దమయంతి : కిరాతుడు

"మహారణ్యమధ్యమున నిట్టి విపత్సముద్రమునఁ గూలఁబడిన అసూర్యంపశ్యయగు దమయంతి యవస్థ నెవరు వర్ణింపగలరు? ఆమె ధైర్యముఁ గోలుపోయి 'మహారాజా, ఏల యిట్టిపనిఁ జేసితివి? నేను నీకేమి భారమనైతిని? నీవు ఏకాకి వగుదువని తోడుపడ నీతో వచ్చితిని. ఆఁకలియైనపుడు ఏకందమూలము లో, ఏఫలములో తెచ్చిపెట్టుటకు వెంటవచ్చితిని. పిపాసయైనపుడు ఎట్లో జలము తెచ్చియిచ్చుటకు వచ్చితిని. నడచినడచి అలిసియున్నపుడు పాదములుఒత్తి శ్రమతీర్చుటకును, మనస్సుకలఁగి తొట్రుపడునపుడు తీయని మాటలుచెప్పి వినోదపెట్టుటకును నీవెంటవచ్చితిని; గాని నిన్నుకష్ట పెట్టుటకు రాలేదు.

'ఇచ్చట ననుడించి యేలపోయితివి?
చచ్చిన నొకచోటఁ జావమే మనము?
కలహాటి నొకభంగిఁ గాలంబు గడపి
మెలఁగమే యడవుల మేదినీనాథ!
గ్రహవేధ లవియెట్టి గతుల వచ్చినను
గృహిణివీడుట నీకుఁ గృత్యమే నాథ?
ఇది నాకు నొంటిగా నిప్పుడు దోఁచె,
ఇది నాకు నడవిగా నిప్పుడు దోఁచె.
ఎక్కడి కేఁగుదు నేమి సేయుదును?
దిక్కెవ్వ రిటమీఁద దెలుఁగేదినాకు?'

అని యనేకవిధముల దుఃఖించుచు

విడుఁక వెదకుచు విపినంబులోనఁ
గుందుచు దమయంతి కొంతదూరంబు
సందుగొందులఁజూడఁ జనుచున్నపుడు
పదపడి యాసమీపంబున నొక్క
పొదరింటిలో నున్న పుట్టలోనుండి
తన తలయెత్తి యాతన్వి నీక్షించి
పెనుఁబాము చెలఁగుచు బిరబిరవచ్చి
రోఁజుచుఁ గన్నుల రోషాగ్నులడర
రాజిల్లువిషములు రాఁజిమండుచును
పూనియప్పుడు పాము భూమీశుదేవి
పదములఁబట్టి తప్పక మ్రింగుచుండె.
తనుమ్రింగు నాఘోరదందశూకంబుఁ
గనుఁగొని శోకాగ్నిఁ గ్రాఁగుచుఁబలికె:
'అక్కటా! యీఘని కాహారమైతి
ఇక్కడ నాకింక నెవ్వరుదిక్కు?
పామును విడిపించు బలవంతు లెవరు?
నామేను మ్రింగుచున్నది యంతకంత.
ఇడుములఁబడి జీవితేశునిఁబాసి
కడపటవచ్చి యీకాలాహిచేతఁ
బడుటకు నాప్రాఁతఫల మిట్టులుండె.
అడలంగ నిపుడు నాయాపదమాన్ప
వడి నిట కెవ్వరు వత్తురో యింక!
పుడమి శే డెచటికిఁ బోయెనో యెఱుఁగ.
ఈవేళ నిందున్న నీపాముచేఁ
జావనిచ్చునె దీనిసాధించుఁగాక
దైవమా! యిట్టిబాధలకు లోఁజేయ
నీవేళ నీకు నేనేమిసేసితిని?'

అని యనేకవిధముల నేడ్చెను. ఈయేడ్పువిని మృగములను వేఁటాడుటకువచ్చి యాప్రాంతమునందే సంచరించుచున్న యొక

'బోయవాఁ డరుదెంచి బోరన నపుడు
సాయక తనచేతఁ బట్టినపెద్ద
కత్తిచే నాపాము కంఠంబుఁద్రుంచి
యెత్తి యావలవైచి యెలనాఁగఁగాచె.'

—చక్రపురి రాఘవాచారి.

అంత దమయంతియు రాహువు నోటనుండి వెలువడి వచ్చిన పూర్ణిమాచంద్రునివోలె నజగరముఖంబువలన వెలువడి వెలుంగుచుండెను."

—శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి.

# సింహళ ద్వీపం కైఫియ్యతు

## [మధుర ఆంధ్రనాయకరాజు సింహళద్వీపపు రాజును జయించిన వృత్తాంతము.]

ఎదటిబలం కేవలహీనదశ పొందినందుచేత వీరిదళవాయిన్ని పాళియగారులున్ను లోజొచ్చి నరుకులాడేటప్పటికి పెద్దమంత్రితో నిలచిన రెండువేలజనాన వెయిజనంచచ్చిన్ని గాయాలతోనున్ను పడ్డందుచేత వీరు కడమజనాన్నిన్ని ఆమంత్రినిన్ని చుట్టుకొన్నప్పుడు యేలినవారు అంబారిమీదినుంచి చూచి ఆమంత్రిమీద దోషంలేదు, ఆరాజు ఆతనిమాట విననందుచేత మానానికిన్ని అపకీర్తికిన్ని వెరిచి ఆరాజుతోకూడా చావుకు యేర్పడి నిలిచినాడు. కనుక ఆతణ్నిచంపక చెయిపట్టుగా పట్టుకొనిరమ్మని ఉత్తరవయినందుచేతే పట్టవలెనని లోచొచ్చినంతలో యెటాయిరాపణ్యఅందు కొండాచన్నియడున్ను వ్రూత్తుమపై మరుప్పతెవకును వారి వుభయత్రనాలుగువేల జనమున్ను వఖపక్కనిలచి తుపాకిజగడం చేస్తూవున్నవారు వారువున్నపార్శ్వం వారున్ను లోచొచ్చిపోతూవుండగా అందు కొండావన్నియాడికి తుపాకిగుండుతాకి తొడవిరిగి గుర్రంమీదనుండి క్రిందపడపొయ్యేటప్పటికి పరిజనంపోయి పడకుండపట్టుకొని పాలకీలోనుంచి అతణ్ని అవతలకు పంపించి తమయజమానుడు గుండుతాకి పడ్డకోపంచేత వారందరు యేకీభవించి మంత్రిమీద నడిచినప్పుడు ఆపాళ్యగాండ్లచేతి తుపాకిగుండుతాకి ఒఖచెయి విరిగి గుంపుమీదినుంచి కిందపడగానే అతనితోనిలచివున్న శింగళప్రజనంవిరిగి పలాయనమ్మయి పారిపోయినారు.

ఆక్షణమె దళవాయి కేశవప్పనాయ డామంత్రిని తనచెయివశంచేసుకొని మంత్రిని డోలీలోవుంచి తమ రాజువద్దకి అంపించగానే రాజుచూచి ఆమంత్రిని బహుసంతోష పడవేశి పాలకీతెమ్మని అందులోవుంచి యాభైగుర్రమున్ను వెయిజనమున్ను వఖసరుదారును కూర్చి ముందరతగిలివుండె మంత్రులు దేశానాధులుతో కూడావుంచి గాయాలుకట్టించి అతన్ని బహుమర్యాదగా అతని గొప్పకు తగ్గట్టు పరిచారకులున్ను నేనుగించి కావలశినపదార్థములు యిమ్మని అంపించినారు. ఆ మంత్రిన్ని ముందరతగిలిన మంత్రులకైనా అధికంగా ఈరాజు మహాధర్మిష్టుడు శత్రుపక్షంగా వున్న మనల యింతమరియాదగావుంచి సంరక్షించినందువల్ల ఆయన ఆజ్ఞాపించినప్రకారం నడుచుకోవలెనని ఆమంత్రులున్ను దేశానాధులున్ను కలిశిమాట్లాడు కొని వుండిరి.

ఇచ్చట రాజబంధువులున్ను కాఫరిజనమున్ను రాజు నేసుగమ్ముట్టుకొని నిలచిరి. అప్పుడున్ను ఆరాజు ధైర్యం విడనకపోయింది పోగా నిలిచినబంధువులకున్ను ఆకాఫీరీలకున్ను ధైర్యంజెప్పి జెయిస్తే రాజ్యము భోగభాగ్యము అనుభవించేము. యుద్ధమందు వెనక్కుతీయక నిలచి మరణమైతే బహుకాలానికి కీర్తిన్ని వీరస్వర్గమున్ను కల్గుతుంది అని నిలచిన బంధువులకున్ను జనానికిన్ని ధయిర్యంచెప్పి ఆపదివేలజనాన్ని శేఖరించుకొని అంబారివిడిచి దిగి గుర్రాన్ని తెమ్మని యెక్కి తానున్ను నిలిచిన జనాన్ని తీసుకుని వీరదళానజొచ్చి చెయికలిశినప్పుడు దళవాయి చిన్నకేశవప్పనాయిడున్ను వారితట్టు దళమున్ను దళనాయకులున్ను పాళ్యగారులున్ను అట్టహాసంచేశి ముందరవచ్చిన కాఫిరీవారలకున్ను మహాయుద్ధంచేసి కాఫిరీవారిజనాన అయిదువేలకు మృతిబొంది రెండువేలకు గాయములచేతనున్ను హతమయి పడిరి. కొంచం మిగిలిన కాఫిరి జనం విరిగి వెనక్కుపోయిరి. అప్పుడు ఆరాజున్ను రాజబంధువులున్ను గుర్రాలెక్కివున్నవారు తెప్పున రాజు గుర్రాన్ని వేయగానే తక్కిన దొరలందరు వెంబడే గుర్రాలువేశినప్పుడు ఆరాజును చంపవద్దు చెయిపట్టుగా పట్టుకొనిరమ్మని యేలిన వారుత్తరువు చేశినారు. ఆమేరకు రాజుమీద తుపాకులు వేయవద్దని దళానికి తాకీదు

చేశి వీరిసైన్యములో యుండే దొరకొడుకులు పాళయగార్లు మరివుండె సరుదారులు అందరు గుఱ్ఱాలుయెక్కివున్నవారు అందరు వారిమీద గుఱ్ఱాలువేశి నరుకులాట అయ్యేటప్పటికి వెనకపార్శ్వం పాళయగారుల జనం చుట్టుకొని బల్యాలతో పొడుచుకునివచ్చినారు. అట్లావుంశి ధయిర్యంవిడవక మధురవారి జనాన అనేకజనానికి ఛేదంచేశి వీరిచేత వారున్ను హతమై రాజుమాత్రం పదిగుఱ్ఱాలనిలిచి యేలినవారి అవుదామూచి చెయుకరుచుకొని అంబారిపార్శ్వం యీపదిగుఱ్ఱాలున్ను కండిరాజున్ను గుఱ్ఱాలునడిపించి యెదటనిలచి వుండే జనాన్ని నరుకుతూ వచ్చేటప్పకి దళవాయి కేళవప్పనాయడు తనగుఱ్ఱాన్ని అడ్డంవేశినప్పుడు అతని వెంబడి గుఱ్ఱాలుయెక్కివుండిన సరుదారులుఆయన వెంబడిగుఱ్ఱాలువేశి కండివారు పదిగుఱ్ఱాలనున్ను చుట్టుకొనిరి.

ఆరాజుమాత్రం అడ్డగించినవారిని నరుకుతూ దళవాయి కేళవప్పనాయిడిమీద గుఱ్ఱాన్ని వేశి నరికేటప్పటికి కెడయాన నరుకుపట్టుకొని చంపవద్దని రాజు వుత్తరవుగనక చంపక పట్టవలెనని చుట్టుకొనినందున అతడు మహాశూరుడు గనుక జనాన్ని దెగ్గిర చారనియ్యకుండా నరుకుతూ తిరుగా ఆకేళవప్పనాయని పార్శ్వం గుఱ్ఱాన్నిదాటించి కత్తిచేతనరికేటప్పటికి కెడయా సమాళించి పట్టేటంతలో రాజు చెయిమించి కేళవప్పనాయనిముంజేత నరుకుపడిన తక్షణం మహాకోపంతో గుఱ్ఱాన్నితిప్పి రాజు అంబారిమీదకిపోయి ఖండిరాజును చంపవద్దు చేపట్టుగాపట్టుమని ఆజ్ఞాపిస్తిరి. అతడు మహాశూరుడు. మహాశూరుడు ప్రాణముతో వఖరి చేతతగిలేవాడు కాడు.అతనిచేత నరుకు నాచేతచూడంశి అని అన్నివుత్తర్వులిస్తే కొట్టివేస్తున్నాను అని చెప్పుతూవుండగానే ఖండిరాజును యెవరూ నరకవద్దని పాళయాన్నిచే చేబట్టగా పట్టుమని రాజు ఆజ్ఞాపించినందుచేత సయిన్యమంతా రాజు ఆజ్ఞకు వెరచి తుపాకులు గాని ఆయుధములు గాని అతనిమీద ప్రయోగించక ఆ రాజును కని తొలుగుతూ వచ్చిరి. ఆసమయాన ఈయనరాజు పార్శ్వంగుఱ్ఱాన్ని దాటించి అడ్డంవచ్చినవారిని నరుకుతూ గుఱ్ఱాన్ని గుప్పని దాటించి రాజువుండె అంబారి యేనుగమీద నరికేటప్పటికి యేనుగు తొండం అరదిట్టంతెగి క్రిందనికూత వేసి యేనుగ వెనుకతీశేటప్పటికి యేలిన వారికి బహుకోపంవచ్చి అవుదాలో వుంచివున్న విండ్లంబులు యెత్తి ఖండిరొమ్ముజూచి లక్షించి ప్రయోగించేటప్పటికి ఆయంపనట్యం కండిరాజు రొమ్మున తాకి వెన్నుపార్శ్వందూశినందున ఆఖండిరాజు మరణమూర్ఛతో కిందపడగానే యేలినవారు అంబారి విడిచి దిగి ఖండిరాజును యెత్తమని చూచే పట్ల మరణమయి వుండెను. గనకసమాధానంగా తొలిగిపోక మూర్ఛపట్టుగా వుండి రాజ్యములున్ను ప్రాణములున్ను విడిచెను. కిరీటశింహాసనాధిపతి శింగళద్వీపమంతా యేకచక్రంగా యేలుతూవున్న మహారాజు గనక యితనికి వీరస్వర్గం కద్దని బహునిండా వెసనపడి ఆ రాజుయెక్కివచ్చిన అంబారి యేనుగ తెమ్మని ఆ యేనుగను పండబెట్టి ఈ రాజును యెత్తి అంబారిలో వుంచి ప్రేతంకనక యీపార్శ్వం ఆపార్శ్వం వొరిగిపడకుండ దిండుతలగడలు ఆనికగా యిచ్చి యిద్దరు మనుష్యులనునియమించి యిరుపార్శ్వలా వొరగకుండా పట్టుకొనిరమ్మని శ్వేతచ్ఛత్రం వుభయ చామరం కుంచలు మొహర్చెలు కల్కికలు మొదలయిన ఆ రాజాంగానికి కలిగిన బిరుదులు అన్నియుపట్టించి తనబిరుదులు కూడా ఆయనముందర నడిపించి జయభేరి మొదలయిన అష్టాదశ వాద్యములున్ను అతని అవుదా ముందర నడిపించి వారివెంబడి వచ్చిన నగారానవబత్తులున్ను తనవెంబడిగా యేనుగులు వొంటెల మీద వచ్చిన నవబత్తునగారాలున్ను అతనిఅంబారి వెంబడి వాయిద్యం చేస్తూరమ్మని అప్పటికి సూర్యఅస్తమానమాయెను గనుక అనేకదీవట్లున్ను మత్తాపులు పగలొత్తులు యెప్పటికన్నా నాలుగుయింతలు అధికంగా జేయించి అతని అవుదాముందర యిరుపార్శ్వములో చంద్రజ్యోతులుసహితముగా అతని అవుదాముందరనడిపించి తన సయిన్యమున్ను అందులో వుండ తగ్గ దొరకొడుకులు సరుదారులు పాళయగారులు అందరినిన్ని వారివారి వాహనాలతో కూడ తనఅవుదాముందు వెనకపక్కపార్శ్వములో వారువారు వచ్చేటటువంటి తారతమ్యముల

ప్రకారం అతని అవుదావెంబడి రమ్మని తనవెంబడివచ్చేటటువంటి దంటునశీపులు భట్రాజులు మొదలయిన వారలంత కండిరాజు అవుదాముందర నిలిచి వారి బిరుదావళియలు యెత్తిపొగడుతూరమ్మని ఆ ఖండిరాజుదిగి వున్నపాళేన వుండేయిటువంటి యేనుగులు గుఱ్ఱాలు ఫిరంగులు తుపాకులు మందుగుండు డేరాలు మొదలయినటువంటి యేమేమిసామానులు ఉన్నవో అవి అన్నియు యెత్తించుక రమ్మని తగుమనుష్యుల నేమించి ఖండిరాజు అంబారిముందుగానున్ను తన అంబారి వెనుకానున్ను యీప్రకారం తాను దిగివున్న పార్శ్వానికి పొయ్యేటప్పటికి ఆ పాళెములో వుండేటటువంటి ప్రజలున్ను ఆ రాజుమంత్రులు దేశానాధులు యెదురుకొని వచ్చి కండిరాజు అంభారిలో వచ్చే వైభోగం చూచి ఆశ్చర్యపడి యీ బిరుదున రాజును సమాధానమై యీ రాజు మనరాజును బహుమరియాదతో తమదండును పిలుచుక వస్తున్నారని బహుసంతోషముతో వఖరికొకఖరు సంతోషముతో వేడుకచూస్తువుండగా యీదళమున్ను యీ రాజులున్ను ఆ పాళెంచేరి రాజునగరి డేరాలవాకిట తన అవుదాదిగి ఖండిరాజుప్రధాన్ని కిందదింపమని ఆ మంత్రులనున్ను దశానాధులనున్ను రప్పించమని మా రాజు యెన్నివిధాలలో చెప్పినా వినక అతిమూర్ఖత్వంచేత యీదశ పొందెను.అయితే యేకాగ్రచిత్తుడై ధైర్యమున్ను శౌర్యమున్నునిలిపి యుద్ధమందు బహుసాహసంచేశి యీదళవాయినిన్ని మాపట్టపుయేనుగనున్ను నరికి గాయపరచి మాచేత అంపకట్టిరమ్మనాని దూశి ఆక్షణం ప్రాణం విడిచి వీరస్వర్గాన్ని పొందెను. కనుక స్వర్గలోకమందు యింతకైనా అధికమయినటువంటి దేవతాస్త్రీలతోకూడి భోగభాగ్యము అనుభవిస్తూ యింద్రలోకాన మహాసామ్రాజ్యవంతుడై యింద్రసభలో వాసంచేస్తూవుండు గనుక యితనికి మీరు వెసనపడవద్దని వారికి సకలవిధములోనున్ను తెలియచెప్పి మీ మతాచార ప్రకారం ముందటిరాజులకు యేయేప్రకారం దానధర్మములున్ను వుత్తరక్రియలున్ను నడిపించుమని అందుకు సామగ్రియలున్ను కావలశిన ద్రవ్యలున్ను యిచ్చి గంధపుచక్కలచేత కొష్టం తయారుచెయ్యమని యీరాజు ప్రేతాన్ని పల్లకీలోవుంచి పుష్పాలచేతఅలంకరించమని తానువొకరు వినా తక్కిన సరుదారులు అందరినిన్ని సాళీను గారులు మొదలయిన సకలమైనవారినిన్ని సకలబిరుదులు సకలవాద్యములతో కూడా అందరినిన్నికూడా పోయి దహనంశాయమని చిన్నకేశవనాయడికి చేశిగాయంకట్టించి అతనిడేరాకుపంపించి తాను స్నానంచేశిఆరాజునిమిత్తం తాను వుపవాసంవుండి మరునాడు అతనికి సంచయనంచేసి అందరు వచ్చిన పిమ్మట తాను స్నానంచేశి నిత్యపూజ నిత్యదానములు చేసిగాయాలుపడ్డ మంత్రులనున్ను తక్కినమంత్రులనున్ను దశానాధులనున్నురప్పించి వారికంతా నగరిలోసెభోజనాలు పెట్టించి వారికి రత్నభూషణాదులున్ను బహుమానం యిచ్చి యిఖమీదనడవవలసిన పనులు యేమిఅని ఆమంత్రులను అడిగి ఆలోచన చేశేటప్పటికి వారుచెప్పింది: స్వామీ మా రాజుకు యీప్రకారం మృతిబొందేకాలం వచ్చెగనుక మావుత్తరవుప్రకారం మేము పోయి సకలవిధాలతో తెలియచెప్పిన్ని వినక అతిమూర్ఖత్వముచేతచచ్చితీరెను.

అదిన్ని తనకు సమానమయినటువంటి రాజుచేత మృతిబొంది స్వర్గస్తుడాయను గనుక శత్రువనియెంచక అతనికి సకలవిభవములతో కూడా తెచ్చిదహనం చేయిస్తిరి. శత్రువపక్షమయిన మమ్మున సకలమరియాదలతో కూడావుంచి మాకు ప్రాణదానమిచ్చి రక్షించితిరి మరియు మా రాజుకు సంతతిలేదు.వారిబంధువులు జ్ఞాతులు మొదలయినవారలందరు యుద్ధాన మరణమయిరి. కనుక నగిరిలో స్త్రీ బాలలుమాత్రం వున్నారు. కనుక పురుషప్రజలేదుగనుక స్వామివారు ఖండిపట్ణం విజయం చేసి సింహాసనారూఢులై యీ శింగళద్వీపానకు పట్టాభిషిక్తులై మమ్ముల సంరక్షిస్తూవుండవలెనని వీరందరు పాదాక్రాంతులై రాజును ప్రార్థించినందుచేత అన్నిటికిన్ని మీశట్ణానకు వచ్చినపిమ్మట చెప్పుతున్నామని ప్రయాణభేరివేయించి యుద్ధములో గాయాలు పడ్డవారిని మాత్రం నిలిపి గాయములుస్వస్తంచేయమని అందుకుతగిన కార్యస్థులను అచ్చటవుంచి పెద్దమంత్రి చిన్నమంత్రి యిద్దరికిన్ని పాలకీలుయిచ్చి గాయాలు కదలకుండా సావధానంగా తమవెంబడి రమ్మని కడమ యిద్దరు

మంత్రులున్ను అయిదుగురు దశానాధులున్ను ముందు
గా అంపించి తానున్ను ప్రయాణం సాగినారు. ఆమం
త్రులు దశలుపోతూవుండగానే సీమకంతా జాబులు
వ్రాశి శీమవారినంతా ఖండికివచ్చి రాజుభేటికి రమ్మని
దోవకడవల్లో మకరతోరణాలు కట్టి కండిపట్టణమంతా
అలంకరించి ముందటి రాజస్త్రీలు బంధువుల నగరిలో
వుండె స్త్రీలు నందరినిన్ని గెవశెనపాలకీలో యె
క్కించుకొని తత్పూర్వంవున్న రాజులు ప్రత్యేకముగా
కలగచేశియున్న అంనరంగాంమనె పట్నానికి పంపిం
చి అచ్చటినగరిలో వుండమని నేమించి వారివారి మన
వర్తులను అక్కడనే యిమ్మని కలగచేశి ఆయానగళ్ళ
క్కావలశిన తగుమనుష్యులను నేమకంచేశి ఖండిపట్ణాన
రాజుకున్ను దళవాయి మొదలయిన దొరలను తగినట్టు
గా నగరు శింగారించి పట్ణం అగరు సాంబ్రాణి ధూప
ములచేత అలంకరించి శీమలకంతా వులపసామగ్రిలున్ను
పాళ్యానికి కావలశిన రస్తు రసవర్గములున్ను యథేష్ట
ముగా రప్పించి రాజున్ను పాళ్యమున్ను వచ్చిదిగి
మజిలీ మజిలీకి విడుదులున్ను నగళ్ళున్ను శృంగారించి
అక్కడి కక్కడ వులఫరస్తు సామగ్రిలున్ను తయారు
జేసి ఆ శింగళప్రదేశములో కలిగిన కార్యస్తులను పిలు
చుక ఆమంత్రులు దిశానాధులున్ను యీరాజును యె
దురుగా వచ్చి కనిపించుకొని పట్ణానికి పిలుచుకొని
పోయి పాళ్యమంతా గంగకీగట్టునదించి యీరాజు
వెంబడి కార్యస్తులున్ను ధొరలున్ను కొంత దళమున్ను
మాత్రం పట్ణానకువచ్చి నగరు ప్రవేశించేటప్పుడు ఆ
శింగళమంత్రి ప్రధానులు దిశానాధులయొక్క స్త్రీలు
కొమార్తెలు సకలాభరణభూషితులైన బంగారుగిన్నె
లో ముత్యాలఆరతులున్ను రత్నాలహారతులున్ను రాజు
కు యెదుటనిలిచి యెత్తిరి.

అప్పుడు ఆ మహారాజు చూచి సంతోషపడి ఆస్త్రీ
లకు అనేక రత్నభూషణములున్ను దివ్యాంబ
రములున్ను ఆ కంచములనిండా వరహాలున్ను
తాంబూలమున్ను వారికిచ్చి అంపించి ఆస్థానమంట
పాన ఆరాజు కొలువుండే రత్నసింహాసనాన కూర్చుండి
ఆసింగళదేశమందుకల మంత్రులు అధికారులు దెశానా
ధులు మరిన్ని వుండదగ్గవారందరు నజరుకాణికలు వారి
వారి యోగ్యతకు తగ్గట్టు కొంచువచ్చివుంచి రాజును
కనుగొని అనేకవిధాల్లో స్తోత్రంచేశిరి. రాజు వారిని
జూచి సంతోషపడి వారివారి యోగ్యతకు తగ్గట్టు
వస్త్రభూషణాదులున్ను తాంబూలాలున్ను యిప్పించి
అచ్చట రామస్వామిగుడికిన్ని కృష్ణస్వామి గుడికి
పోయి దరిశనంచేశి స్వాములకు అభిషేక నయివేద్య
ములున్ను పీతాంబరములున్ను రత్నభూషణాదులు యి
ప్పించి మూడుదినాలు వుండి ఆమీద కదురికామానికి
పోయి కదిస్వెశ్వరుని దరిశించి తిరుగా పట్ణానికివచ్చి
తన బంధువులందరిని సముఖానకురప్పించి చూచి అందు
లో యోగ్యుడున్ను బుద్ధిమంతుడున్ను మహాపరాక్రమ
శాలిన్ని ఆకారరేఖా మహారాజలక్షణవంతుడైన తన
భావమరిది విజయగోపాలనాయని పిలిచి నీ వీశింగళ
ద్వీపానికి రాజుగావుండమని పురోహితుల రప్పించి
మంచిదినమున్ను లగ్నమున్ను సుమూహుర్తమున్ను
చూచి ఆదినమందు అచ్చటి గంగాజలమున్ను ఆదేశ
మందుగల పుణ్యనదుల తీర్థములున్ను తెమ్మని అతనికి
అభిషేకంచేశి స్వర్ణపట్నంమీద వ్రాయించి లలాట
మున ధరియించి సకలాభరణభూషితునిజేసి గంధ
పుష్పమాల్యాంబరములు ధరియించి సకలదళమున్ను
సింగళపు మంత్రులు ప్రధానులు దిశానాధులున్ను వారి
సయిన్యమున్ను రధగజతురగపదాతులున్ను వుభయ
త్రల పాళయగారులున్ను చుట్టు పరివేష్టించి రాగా
పట్ణంవీధులు అలంకరించి పట్టపుయేనుగు రత్నాల ఆభర
ణముతో శృంగారించి నవరత్నఖచితమయిన హావుదా
అంబారివుంచి అంబారిలో విజయగోపాలరాజున్ను
సవారిగమ్మని శింగళరాజుకు కలిగిన బిరుదులున్ను పాం
డ్యదేశాధిపతికి కలిగిన బిరుదులున్ను రెండు వరుసలుగా
యేనుగముందర నడవగా స్వేతఛత్రం వుభయచామ
రాలు మొర్చలు కుంచలు వెటపావడలో హావుదా
మీద వెనకతట్టునవుండి కొందరు వేస్తూరాగా నాటక
శాల స్త్రీలుముందర నాట్యమాడుతున్ను భట్ల కటికాలు
యిరువంకల పొగుడుతూరాగా శింగళపుకవులు ఆ
రాజు ప్రతాపబిరుదావళులు చూర్ణికలుగా పొగుడుతూ

రాగా పురస్త్రీలు ముత్యాల రత్నాల హారతులు ఆయా వీధుల్లో నిలిచి యెత్తుతూరాగా బంగారు బెత్తాలు వెండిబెత్తాలువారు ముందర రెండువరుసలుగా సందడీ తొలిగిస్తూరాగా భూలోకదేవేంద్రునివలె పట్నప్రవేశం రాగా రాజా పెదకృష్ణప్పనాయడువారు మైసజ్జమీద ఉండి చూచి సంతోషముతో ఉండగా సవారి చుట్టి వచ్చి హజారంముందరదిగి ఆస్థానమంటపానకు వచ్చినప్పుడు మధురరాజు యెదురుగావచ్చి చెయిపట్టి పిలుచుకొనిపోయి తనచేతులార రత్నకిరీటంధరియించి చేబట్టి రత్నసింహాసనమందు కూర్చుండబెట్టి ఆశింగళపు వారు నజరు కానికెలువుంచి సాష్టాంగులై నిలిచియుండగా వారివారికి ఆశింగళ దేశంరాజులు పట్టానికి వచ్చినప్పుడు నడుచు బహుమతులుకు యిప్పుడు ద్విగుణం అధికంగా నడిపించి గంధపుష్పతాంబూలాలు వారికందరికీ యిప్పించి సంగీతసాహిత్యములతో నూతనపట్టం రాజుకు పాండ్యదేశాధిపతి శింగళద్వీప మహారాజనిన్ని ప్రతాపలంకేశ్వరుడనిన్ని, రెండు ఖితాబు లిచ్చి ఆ నలుగురు అతనిపార్శ్వం విడిచిపెట్టి తాను తన డేరాలోవచ్చి దిగినప్పుడు ఆ ప్రధాని మంత్రులు దిశలు మొదలైనవారందరున్నవొచ్చి సాష్టాంగులై నిలిచి వొక మనవి అడిగినారు.

ఏమంటె సనాతనముగా రాజున్ను యీదేశం సకలప్రజలున్ను వొక బౌద్ధమతమేకాని రెండో మతములేను గనుక అట్లాగంటిదేశమున్ను ప్రజలున్ను వుపరుమాసీమంతా రాజె దయివమని యెంచివున్నారు గనక దయివమంతా వొకటి కాబట్టి అయినప్పటికిన్ని దేశాచారప్రకారం రాజున్ను వుండేటట్టు ఆజ్ఞాపించవలశింది యని దేశంవాల్లు యావత్తువచ్చి మనవిచేసుకోంగా ఆప్రకారం నడుచుకొమ్మని వుత్తరవుయిచ్చి పంరెండు ఘటాలు యెనుగలున్ను నగరి బొక్కసాంనుంచి రత్నభూషణములు కొన్నిన్ని వెండిపాత్రలున్ను బంగారుపాత్రలున్ను దివ్యాంబరములున్ను దండుశలవుకని యాభై యొక్క లక్షవరాలున్ను కొన్ని యేనుగదంతములున్ను కొన్ని ముత్యాలసరములున్ను నాటకశాలకైన యోగ్యంగల సిన్నపడుచులుగా సౌందర్యంకలవారుగా సర్వాభరణములు అలంకరించి నాటకశాలకు యిప్పించి సంవత్సరానికి కప్పం రెండుయేనుగలున్ను పన్నెండు లక్షల రూపాయిలున్ను తీరుమానంచేశి మన్నారు ముత్యాల సలాభమున్ను యీ మూడున్ను వ్రాశి రాజుచేతిశిఖాను శింగళపుమంత్రులు ప్రధానులు కార్యస్తులచేతివ్రాలున్ను వ్రాశి యిప్పించిరి.

అటుతరువాత పట్నపురాజుకున్ను ప్రధానులు మంత్రులు కార్యస్థులు యావత్తునున్ను రప్పించి రాజుకున్ను రత్నభూషణాంబరములు యిప్పించి యితరంవార్లకు వారివారి తరంచొప్పన భూషణాంబరములు యిప్పించి దండుకూచిశాయమని అచ్చట ఆ రాజు నూతనం గనుక ఆరువేలజనమున్ను అందుకు తగిన సరుదారులునున్ను ఆ రాజుకు ఆత్మసంరక్షణార్థముగా దేవిడీవాకిట నేమకంజేసి ఆ రాజుకు కేవలం స్వకీయ్యులుగావుండే బంధువులలో అరవై యిండ్లవారు ఖండిలో రాజువద్దవుండమనిన్ని వెఖ సంవత్సరానికి వెనుక ఆ రాజునున్ను ఆ బంధువుల సంసారం చిన్నాచిరుతలు రప్పించుకొమ్మని ఆజ్ఞాపించి ప్రయాణభేరి వేయించి మంచిలగ్నమందు బైలుదేరి గంగకు యీగట్టున పెద్దపాళ్యం వచ్చిచేరి నాటిదినం అచ్చట మొఖామిచేశినందున ఆశింగళమంత్రి ప్రధానులున్ను కొత్త రాజున్ను వెంబడిగావచ్చి దళవాయి చినకేశవప్పనాయినికిన్ని మరిన్ని యేలినస్వామి వెంబడివచ్చిన రాజబంధువులు అనేక సరుదారులు సామాజికులు కార్యస్థులు పాళ్యపట్టు దొరకొడుకులు వారి వెంబడి చేరువకాండ్లు వారి బంధువులు వారికార్యస్థులు సహితం సకలమయినవారికిన్ని వారివారి యోగ్యత వారివారి గొప్పతనానికి తగినట్టుగా వస్త్రభూషణాలు యిప్పించి అందరికి విందులు చేయించిరి.

—సశేషము.

# సోదరికి

వఝ్ఝుల వేంకటేశ్వరకవి

రసనాంచలమున సరస్వతీనాట్యంబు
    వెలయింపఁజాలు కవిత్వశక్తి
కత్తిఁబూనిన చేతఁ గదననైపుణ్యంబుఁ
    చూపింపనేర్చు ప్రతాపశక్తి
దేశోపకారైకదీక్షఁ గైకొని రాజ్య
    తంత్రముల్ నడిపించు మంత్రశక్తి
ఆచారకాలుష్య మడఁగించి సంఘసం
    స్కారంబుఁ జేయు విజ్ఞానశక్తి
అఖిలశక్తులు నీహృదయంబునందె
యిముడియున్నవి మేల్కొల్పు మింక హాని
నున్నతికిఁ బాటుపడుచున్న సోదరులకు
సోదరీ! తోడుపడుము చేయూతనిమ్ము.

నీదృష్టి వేడిక్రొన్నిప్పుకల్ రాల్చునా
    కలుషసంతానంబు కాలిపోదె?
నీచూపు చలువవెన్నెలతేట లీనునా
    గాఢాంధకారంబు కదలిపోదె?
నీవీక్ష యమృతధారావృష్టిఁ గురియునా
    విషవృత్తి దూరమై వెడలిపోదె?
నీకనుల్ దుఃఖాశ్రునిచయంబుఁ గార్చునా
    కఠినపాషాణంబు కరఁగిపోదె?
ఎంతకాలంబు గడచెనో యిప్పటికిని
నీవు నిదురించుచున్నావు, నేఁటికైనఁ
దెలివిగాంచుము, నాలుగుదెసల గనుము,
సోదరీ! తోడుపడుము మాయుద్యమముల.